APTEL/26/A4813



# శ్రీ వార్త

జాతీయ తెలుగు దినపత్రిక

కొత్త ఆలోచన.. కొత్త వార్త




సంపుటి : 01 సంచిక :63 ఎడిటర్.: కూరేటి సతీష్ పేజిలు : 08, వెల రూ. 2రూ/ గురువారం - 10 - సెప్టెంబర్ - 2026

Published From : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad




### బీఆర్ఎస్ ఎమ్మెల్యేలదే కీచకపర్వం..

## వీడియో విడుదల చేసిన మంత్రి సీతక్క

- ఇద్దరు మహిళా ఎమ్మెల్యేల మధ్యలోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యే వచ్చారు
- కోవా లక్ష్మీ, సబితా ఇంద్రారెడ్డిపై ఆ పార్టీ ఎమ్మెల్యేలే అనుచితంగా వ్యవహరించారు

## స్థానిక సంస్థల ఎన్నికలు కురుక్షేత్ర సంగ్రామంలాంటివి: జగన్




- అధికార దుర్వినియోగం, అక్రమ కేసులను ఎదుర్కొని వైసీపీ శ్రేణులు నిలబడాలని పిలుపు
- సర్ ప్రక్రియలో 44 లక్షల ఓట్లు గల్లంతయ్యాయని వెల్లడి
- స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా

# ఎన్నారైల అండతోనే గెలిచాం..

## చంద్రబాబు అరెస్ట్ సమయంలో కొండంత బలమిచ్చారు

### ప్రజా ప్రభుత్వ ఏర్పాటులో ఎన్నారైల కృషి మరువలేనిది

- తెలుగుజాతిని ప్రపంచంలో నెం.1గా నిలిపే బాధ్యతను సమిష్టిగా తీసుకుందామని పిలుపు
- చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా నిరసనలకు పిలుపు
- 2029 ఎన్నికల్లోనూ ఎన్డీయేను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టీకరణ



అమరావతి: 2024 ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వం ఏర్పడటంలో ప్రవాస తెలుగువారి (ఎన్నారై) పాత్ర మరువలేనిదని, వారి అండతోనే తెలుగుదేశం పార్టీ మిగతా 2 లో

### ఇది బీఆర్ఎస్ సస్పెన్షన్ కాదు..

## ప్రజా సమస్యలపై వేసిన సస్పెన్షన్ వేటు: హరీశ్ రావు



- అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేసిన స్పీకర్ మిగతా 2 లో

# వచ్చే మార్చి నాటికి భూ సమస్యలు పరిష్కరిస్తాం

### కూటమి ప్రభుత్వం వచ్చాక.. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం

- గతంలో రెవెన్యూశాఖలో డబ్బులు ఇవ్వకపోతే పని జరగదు అనే అపవాదు ఉంది
- అన్ని సమస్యలు పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం
- గత ప్రభుత్వంలో నేరాలు ఘోరాలు చేశారు
- భూములకు భద్రత ఇవ్వడమే కూటమి ప్రభుత్వం అజెండా




మాచవరం: వచ్చే మార్చి నాటికి రాష్ట్రంలో భూ సమస్యలన్నీ పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం పరిధి మాచవరంలో 'మీ భూమి- మీ హక్కు' కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. గతంలో రెవెన్యూశాఖలో డబ్బులు ఇవ్వకపోతే




## తిరుమల శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల తేదీలు ఖరారు.. బుక్‌లెట్ విడుదల

శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల తేదీలు ఖరారు

సెప్టెంబర్‌లో సాలకట్ల, అక్టోబర్‌లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు

ఉత్సవాల షెడ్యూల్‌తో కూడిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించిన టీటీడీ

తిరుమల అన్నమయ్య భవనంలో విడుదల చేసిన చైర్మన్ బీఆర్ నాయుడు

# అది ఫాంహౌస్ భావజాలం.. సభ్యులతో అమలు చేయిస్తున్నారు

### "అసెంబ్లీ వద్ద ఘటన ఆషామాషీగా జరిగింది కాదు

- ఒక తల్లిని ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడటం అత్యంత బాధాకరం
- సభాపతిపై వ్యాఖ్యలు యావత్ ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ
- నిబంధనల ప్రకారం శాసనమండలి చైర్మన్ చర్యలు తీసుకోవాలి



హైదరాబాద్: భారాస నాయకత్వం ఫాంహౌస్ భావజాలాన్ని సభ్యులతో అమలు చేయించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. అనుచిత వ్యాఖ్యలు చేసినందున తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై నిబంధనల ప్రకారం శాసనమండలి చైర్మన్ చర్యలు తీసుకోవాలని, ఘటనపై భారాస అధినేత కేసీఆర్ స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని శాసనసభలో మిగతా 2 లో

# గవర్నర్‌ను కలిసిన కేటీఆర్.. కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ

### గవర్నర్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ

- 1000 రోజులు గడిచినా కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేదని విమర్శ
- తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారని ఫిర్యాదు
- దాడులకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు అందజేత
- రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వ వైఫల్యంపై ఆరోపణ



హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ ఎమ్మెల్యేల బృందం బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తోందని ఈ సందర్భంగా వారు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. మిగతా 2 లో

# మళ్లీ అదే సెంటిమెంట్‌తో... జగన్ పాదయాత్ర 2.0కు ముహూర్తం ఖరారు

### 2027 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో యాత్ర ప్రారంభం

- మరోసారి సుదీర్ఘ పాదయాత్రకు సిద్ధమైన వైఎస్ జగన్
- బాపట్ల జిల్లా పర్చూరు కార్యకర్తల సమావేశంలో ప్రకటన
- 2029 ఎన్నికలే లక్ష్యంగా రెండో విడత యాత్రకు వ్యూహరచన
- 'ప్రజా సంకల్ప యాత్ర' సెంటిమెంట్‌నే మళ్లీ ఫాలో అవుతున్న జగన్




అమరావతి: వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి సుదీర్ఘ పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. 2029 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లేందుకు ఆయన ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా తాను చేపట్టబోయే రెండో విడత పాదయాత్రకు ముహూర్తం ఖరారు చేశారు. 2027 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని




## ఈ20 ఇంధనంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ప్రకటన.. కేంద్రానికి మద్దతు

- ఈ20 పెట్రోల్‌తో వాహనాలకు నష్టం లేదన్న మంత్రి పొన్నం ప్రభాకర్
- తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అసెంబ్లీలో వెల్లడి
- ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వాదనకు తెలంగాణ మద్దతు

### పోలవరాన్ని గోదాట్లో కలిపారు..

## మెగా డీఎస్సీకి అడ్డుపడ్డారు




- గత ఐదేళ్ల పాలనలో రాష్ట్ర విభజన కన్నా ఎక్కువ నష్టం జరిగింది
- రాజకీయ కక్షతో పోలవరం ప్రాజెక్టును నాశనం చేశారు
- హింసను ప్రేరేపిస్తూ గొడ్డలి పార్టీ కుట్రలకు పాల్పడుతోంది
- మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు వందల కేసులు వేశారు
- ప్రజల మద్దతుతోనే పోలవరం, అమరావతి నిర్మాణం సాధ్యమవుతోందని ఉద్ఘాటన

శ్రీ వార్త
జాతీయ తెలుగు దినపత్రిక
కొత్త ఆలోచన.. కొత్త వార్త
జనరల్ న్యూస్
గురువారం -10- సెప్టెంబర్, 2026

## ముగిసిన సమగ్ర పోషక యాజమాన్య సర్టిఫికెట్ కోర్సు

### -నేల ఆరోగ్యాన్ని కాపాడటమే రైతుల రైతుల ప్రధాన లక్ష్యం



ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :మండల కేంద్రమైన ఘంటసాలలోని కృషి విజ్ఞాన కేంద్రంలో 15 రోజుల పాటు నిర్వహించిన "సమగ్ర పోషక యాజమాన్యం" సర్టిఫికెట్ కోర్సు బుధవారంతో ముగిసింది. వ్యవసాయ రంగానికి సంబంధించిన సిబ్బందికి పంటల్లో సమతుల్య పోషక యాజమాన్యంపై శాస్త్రీయ అవగాహన




కల్పించడమే ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని కెవికె సమన్వయకర్త డా సుధారాణి తెలియచేశారు.ఈ శిక్షణ ద్వారా పొందిన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేసి, ఎరువుల సమతుల్య వినియోగం ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడంతో పాటు నేల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. సమగ్ర పోషక యాజమాన్యం ద్వారా నేల సారాన్ని దీర్ఘకాలం పరిరక్షిస్తూ, పంటల దిగుబడి నాణ్యతను మెరుగుపరచవచ్చని తెలిపారు. కెవికె శాస్త్రవేత్తలు, సిబ్బంది, శిక్షణ అభ్యర్థులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధితులకు దాతల సహాయం

-రెడ్ క్రాస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్టీల్ సామాగ్రి, హెవీ టార్పాలిన్లు, రగ్గులు సహాయం

-50కిలోల బియ్యం అందించిన టీడీపీ నేత, మాజీ ఎంపీటీసీ గువ్వాబత్తిన నాగేశ్వరరావు



ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :మండల పరిధిలోని లంకపల్లిలో అగ్నిప్రమాద బాధితులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో సహాయం అందచేశారు. ఇటీవల అగ్నిప్రమాదం సంభవించి నిరుపేద ముస్లింలు షేక్ సలీమ్, మహమ్మద్ రఫీలకు చెందిన పూరిళ్లు పూర్తిగా కాలిపోయాయి. బాధిత కుటుంబాలకు బుధవారం రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి భవిరి శంకర్ నాధ్, జిల్లా కో ఆర్డినేటర్ కళ్లేపల్లి హరికృష్ణ రెడ్ క్రాస్ జిల్లా శాఖ ద్వారా ఘంటసాల తహసీల్దార్, రెడ్ క్రాస్ మండల అధ్యక్షులు వి.విజయ ప్రసాద్ చేతులమీదుగా స్టీల్ వంటపాత్రల సెట్లు, హెవీ టార్పాలిన్లు, రగ్గులు అందచేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు గువ్వాబత్తిన నాగేశ్వరరావు 50కిలోల బియ్యం అందచేశారు. కార్యక్రమంలో డీసీ వైస్ చైర్మన్ పరిశే చలపతిరావు, టీడీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు దిరిశం వెంకట్రావు, రెడ్ క్రాస్ చల్లపల్లి శాఖ చైర్మన్ నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, ట్రెజరర్ ఎండీ.ఏ.కే.జిలాని, రెడ్ క్రాస్ ఘంటసాల, చల్లపల్లి శాఖల ప్రతినిధులు కావూరి సాల్మన్ రాజు, బీవీకేవీ ప్రసాద్, వీఆర్ఓ శివకుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.- - - - పక్కా గృహం మంజూరుకు విజ్ఞప్తి:.... ఈ సందర్భంగా అగ్ని ప్రమాద బాధితులు తమకు కేంద్ర ప్రభుత్వం అగ్ని ప్రమాద బాధితులకు కేటాయించే ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా పక్కా గృహాలు మంజూరు చేయాలని తహసీల్దార్ విజయ ప్రసాద్ కు విజ్ఞప్తి చేశారు.

## అన్నాభిషేకంలో రాజశేఖర్ స్వామి వారు

## 3000 మంది భక్తులకు అన్న ప్రసాదాలు



అవనిగడ్డ సెప్టెంబర్ 9 శ్రీ వార్తదివిసీమలో పురాతన దేవాలయంగా విశేష పూజలు అందుకుంటున్న రాజ రాజేశ్వరి సాహిత రాజశేఖర్ స్వామి వారి దేవస్థానంలో 3000 మంది భక్తులకు ఆలయ అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాదాలను అందజేశారు. బుధవారం మాస శివరాత్రిని పురస్కరించుకొని స్వామివారికి వేకువజాము నుండే విశేష పూజలు అర్చనలు అభిషేకాలు నిర్వహించి స్వామివారిని విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి సామూహికంగా లలిత సహస్రనామ పారాయణం లింగాష్టకం పారాయణం చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని తీర్థ అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు భారీగా తరలివచ్చి అన్న ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వాహణాధికారి యార్లగడ్డ శ్రీనివాస్ (వాసు) ఆలయ చైర్మన్ ఆలయ పాలకవర్గ సభ్యులు ఆలయ సిబ్బంది భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు,

## సిబ్బంది కి సూచనలు చేస్తున్న రవాణా అధికారి కే వెంకటేశ్వర్లు

## ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి




అవనిగడ్డ సెప్టెంబర్ 9 శ్రీ వార్త డిపోను సందర్శించిన కృష్ణా జిల్లా ప్రజా రవాణా అధికారి కె .వెంకటేశ్వర్లు పరిశీలించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని సూచించారు. బుధవారం ఆయన బస్ స్టేషన్ ను పరిశీలించి ప్రయాణికులకు అందిస్తున్న తాగునీటి సౌకర్యం ,మరుగుదొడ్ల పరిశుభ్రత మరియు ప్రయాణికుల కూర్చొను సీట్లు , ఫ్యాన్లు మొదలైన సౌకర్యాలు, మరియు డిపో నిర్వహణకు సంబంధించిన అంశాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ప్రజా రవాణా అధికారి డిపో సిబ్బంది మరియు సూపర్వైజర్లతో మాట్లాడుతూ ప్రయాణికులు మరియు మహిళా ప్రయాణికుల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా మరియు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని సూచించారు. ఎంక్వయిరీ సిబ్బంది ప్రయాణికులతో మర్యాదగా మాట్లాడవలసిందిగా కంప్లైంట్స్ రాకుండా చూసుకోవలసిందిగా ఆదేశించార.అలాగే కార్గో రవాణా ద్వారా డిపో ఆదాయాన్ని పెంచేందుకు కార్గో సిబ్బంది మరింత కృషి చేయాలని సూచించారు.సర్వీసులను నిర్ణీత సమయానికి సక్రమంగా నడపాలని, ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందికి తెలిపారు.స్త్రీ శక్తి పథకం అమలులోకి వచ్చిన అనంతరం మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగినందున, తదఅనుగుణంగావారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలను కల్పిస్తూ, సర్వీసులను సమయపాలనతో నిర్వహించాలని ప్రత్యేకంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజా రవాణాఅధికారి వారితో డిపో మేనేజర్ కే.హనుమంతరావు , అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ శ్రీలక్ష్మి మరియు సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ రెడ్డి పైశాచికత్వానికి చంద్రబాబు అరెస్టు నిదర్శనం

ప్రజా సమస్యలపై పోరాటాన్ని జీర్ణించుకోలేక కక్ష గట్టి అరెస్టు- జగన్ రెడ్డి అరాచకం పట్ల తెలుగు ప్రజలంతా ఏకమై తిరుగుబాటు చేశారు70 దేశాల్లో యువత స్వచ్ఛందంగా రోడ్డెక్కి జగన్ రెడ్డి అరాచకాన్ని ప్రశ్నించారు

అరచేతితో సూర్యుడిని అడ్డుకోలేరని జగన్ రెడ్డికి మంత్రి కొల్లు రవీంద్ర వార్నింగ్



మచిలీపట్నం శ్రీ వార్త న్యూస్ అరెస్టులు, అరాచకాలతో మంచిని అణచివేయడం ఎవరి తరమూ కాదనే విషయాన్ని జగన్ రెడ్డి తెలుసుకోవాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. నారా చంద్రబాబు నాయుడు గారి అక్రమ అరెస్టుకు మూడేళ్లు పూర్తైన సందర్భంగా మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కొవ్వొత్తులు వెలిగించి సంఘీభావం తెలిపారు. నిజం గెలిచింది పేరుతో సంఘీభావం ప్రకటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సెప్టెంబర్ 9 రాష్ట్ర చరిత్రలో చీకటి రోజు. రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపాలి, తెలుగు వారిని ప్రపంచ స్థాయిలో నిలబెట్టాలని అహర్నిశలు శ్రమించారు. అలాంటి వ్యక్తిపై కక్ష పూరితంగా తప్పుడు కేసు పెట్టి అరెస్టు చేశారు. ఆ రోజే రాష్ట్రంలో ప్రజా తిరుగుబాటు మొదలైంది. రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా ఏకమై రోడ్డెక్కారు. విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులు కూడా రోడ్డెక్కి నినాదాలు చేశారు. సుమారు 53 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు జగన్ రెడ్డి నిరంకుశత్వాన్ని నిలదీస్తూ రోడ్డెక్కారు. జగన్ రెడ్డి లాంటి నియంత, నిరంకుశ పాలకుడు రాష్ట్రానికి వద్దంటూ హోరెత్తించారు.బాబాయి హత్య, మద్యం కుంభకోణం, కల్తీ మద్యం, సంక్షేమ పథకాల పేరుతో చేసిన మోసం, రాష్ట్రంలో జరుగుతున్న విధ్వంసం నుండి ప్రజల దృష్టి మరల్చేందుకు చంద్రబాబు నాయుడి బస్సు తలుపులు పగలగొట్టి మరీ అరెస్టు చేశారు.వేలాది మందికి ఉద్యోగాలిచ్చిన సీమెన్స్ సంస్థ ద్వారా అక్రమాలు జరిగాయంటూ తప్పుడు కథనాలు వండి వార్చారు. నారా లోకేశ్ గారిని నడిరోడ్డుపై నిలిపేసి పైశాచిక ఆనందం పొందారు. విజన్ 2020 ద్వారా రాష్ట్ర భవిష్యత్తుని నిర్దేశించిన ఘనత నారా చంద్రబాబు నాయుడు గారిది. ఐటీ విప్లవాన్ని అందిపుచ్చుకుని లక్షలాది మంది తెలుగు యువతను ప్రపంచ దేశాల్లో అత్యున్నత స్థానాల్లో నిలబెట్టారు. అలాంటి చంద్రబాబు నాయుడు గారిని తప్పుడు కేసులో అరెస్టు చేసినప్పటికీ తెల్లకాగితంలా బయటకొచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయ చరిత్రలో సువర్ణాక్షర అధ్యాయం నారా చంద్రబాబు నాయుడు. సుమారు 48 సంవత్సరాల పాటు రాష్ట్రం కోసం తపించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం శ్రమించారు. అభివృద్ధికి చిరునామాగా ఆంధ్రప్రదేశ్ ను మార్చారు.గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు. ఉపాధి కల్పించలేదు. మెగా డీఎస్సీ పేరుతో దగా చేశారు. అలాంటి జగన్ రెడ్డి అత్యంత పారదర్శకంగా జరిగిన మెగా డీఎస్సీపై అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నాడు. అవహేళన చేస్తున్నాడు. డీఎస్సీ అంటే ఏంటో కూడా తెలియని వారు కూడా నిందలేస్తున్నారు. సుమారు 30 కేసులు వేసి డీఎస్సీని అడ్డుకోవాలని ప్రయత్నించారు. కానీ కోర్టులు తిప్పి కొట్టాయి. అయినా జగన్ రెడ్డి సైకో మనస్తత్వంతో ఆరోపణలు చేస్తున్నాడు.కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పారదర్శకంగా పాలన సాగిస్తుంటే చూసి ఓర్వలేక ప్రజల్లో ఆందోళనలు రేకెత్తించేందుకు కుట్ర చేస్తున్నాడు. ఎవరికీ రూపాయి కూడా ఇవ్వలేదని ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు చెబుతున్నారు. స్పోర్ట్స్ కోటాలో భార్య భర్తలు ఉద్యోగాలు పొందడం తప్పా? డీఎస్సీపై సీబీఐ విచారణ కావాలంటున్న జగన్ రెడ్డి.. వివేకా హత్యపై సీబీఐ విచారణ జరిపించాలని ఎందుకు కోరడం లేదు. చెల్లికి న్యాయంచేయాలని ఎందుకు అనుకోవడం లేదు.?ఏపీపీఎస్సీ, మద్యం స్కాంపై విచారణ ఎందుకు కోరడం లేదో సమాధానం చెప్పాలి. భూ రికార్డులు తారుమారు చేసి, ఆర్డీవో కార్యాలయాన్ని కూడా తగలబెట్టేయడంపై సీబీఐ విచారణ ఎందుకు కోరడం లేదు.? సీదిరి అప్పలరాజు కొడుకు ఒక వ్యక్తిని బైకుతో గుద్ది చంపేస్తే.. తప్పేంటి అంటున్నాడు. హత్యలు చేసి, మానభంగాలు చేసినోళ్లను అమాయకులు అంటూ వెనకేసుకొస్తున్నాడు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకమైన పాలన అందిస్తోంది. పోలవరం అమరావతి అభివృద్ధి చేస్తున్నాం. పట్టిసీమ, పోలవరం ఎడమ కాలువ, వెలిగొండ ప్రాజెక్టులతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సాగునీరు అందిస్తున్నాం. క్రెడిట్ చోరీ అంటూ మాట్లాడే జగన్ రెడ్డి.. ఏం ఉద్దరించాడో సమాధానం చెప్పాలి. ఐదేళ్ల పాలనంతా రాష్ట్రాన్ని నాశనం చేశాడు. కానీ నేడు కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్రను కలలకు రెక్కలు పేరుతో అభివృద్ధి చేస్తోంది. రైజింగ్ రాయలసీమ పేరుతో సీమను అభివృద్ధి చేస్తున్నాం. సన్ రైజ్ ఏపీ పేరుతో కోస్తాను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం. ఒకప్పుడు ఏపీలో పెట్టుబడులు పెట్టాలంటేనే భయపడే పరిస్థితి నుండి.. నేడు ఏపీలో పెట్టుబడికి అవకాశం వస్తే చాలు అనే స్థితికి తీసుకొచ్చామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యన్నారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని,గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబా ప్రసాద్, టౌన్ అధ్యక్షులు లోగిసెట్టి స్వామి, మండల అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు, ఇలియాస్ భాష,సహా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంగినపూడి బీచ్‌లో మహాగణపతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి.

భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

14 రోజుల పాటు నిరంతర విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, రవాణా సౌకర్యాలు కల్పించాలి.

ప్రతిరోజూ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను ఆకట్టుకోవాలి.

అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజి






మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ మంగినపూడి బీచ్ సాగర తీరంలో 63 అడుగుల ఎత్తైన మహాగణపతి మట్టి విగ్రహం ఏర్పాటు చేసి 14 రోజుల పాటు నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు.బుధవారం నగరంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్, ఉత్సవాల నిర్వహణకు సంబంధించి శాఖల వారీగా చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించి, పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 63 అడుగుల ఎత్తైన మహాగణపతి దర్శనానికి 14 రోజుల పాటు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రతి శాఖ తమకు అప్పగించిన బాధ్యతలను ముందస్తు ప్రణాళికతో పూర్తి చేయాలని సూచించారు.ఉత్సవాలకు వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఏర్పాటు చేసి, జనసమూహాన్ని సమర్థవంతంగా నియంత్రించాలని పోలీసు శాఖను ఆదేశించారు. పార్కింగ్ ప్రాంతాలను ముందుగానే గుర్తించి, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు.గతంలో బీచ్ ఫెస్టివల్ సందర్భంగా ఎదురైన ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని మచిలీపట్నం--మంగినపూడి ప్రధాన మార్గానికి ప్రత్యామ్నాయంగా గుర్తించిన రహదారిని అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఆ మార్గంలో అవసరమైన జంగిల్ క్లియరెన్స్, రహదారి బలోపేతం తదితర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.మంగినపూడి సాగర తీరంలో భక్తులు సముద్రంలోకి వెళ్లకుండా ప్రత్యేక బారికేడింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచడంతో పాటు లైఫ్ బాయ్స్, లైఫ్ జాకెట్లు, రక్షణ పరికరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.ఉత్సవ ప్రాంగణంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన విద్యుత్ లైన్లు, కండక్టర్లను ముందుగానే మార్చి, ఉత్సవాల సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఉత్సవాలకు భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు, బీచ్ పరిసరాల్లో నిరంతరం పారిశుద్ధ్య పనులు నిర్వహించాలన్నారు.అవసరమైన చోట్ల తగిన సంఖ్యలో డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి, వాటిని ఎప్పటికప్పుడు ఖాళీ చేయాలని సూచించారు. ఉత్సవాల ప్రారంభం నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.భక్తుల కోసం తాగునీరు, మొబైల్/తాత్కాలిక మరుగుదొడ్లను తగిన సంఖ్యలో ఏర్పాటు చేసి, వాటి నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఉత్సవ ప్రాంగణంలో అగ్నిప్రమాదాలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని అగ్నిమాపక శాఖను కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచడంతో పాటు కీలక ప్రాంతాల్లో ఫైర్ ఎక్స్టింగ్విషర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. 14 రోజుల పాటు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే నేపథ్యంలో అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు.14 రోజుల పాటు ప్రతిరోజూ సాయంత్రం భక్తులను ఆకట్టుకునేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. స్థానిక కళాబృందాలు, డ్యాన్స్ గ్రూపులు, డ్యాన్స్ స్కూల్స్, నాటక బృందాలు, కళాజాత, కూచిపూడి కళాకారులు తదితరులను భాగస్వామ్యం చేయాలని సూచించారు.మచిలీపట్నం నుంచి మంగినపూడి బీచ్‌కు భక్తుల రాకపోకలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి అరగంటకు బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని, భక్తుల రద్దీని బట్టి సంఖ్యను పెంచాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పి సీఈవో డాక్టర్ జె అరుణ,అదనపు ఎస్పీ వి వి నాయుడు,బందరు ఆర్డిఓ కె సాంబశివరావు, కార్యక్రమ నోడల్ అధికారి డిఆర్డిఏ పీడీ హరిహరినాథ్,డిపిఓ ఎం ధనలక్ష్మి, మచిలీపట్నం నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ దయాకర్, ఆర్ అండ్ బి ఈఈ లోకేశ్వరరావు, డ్వామా పీడీ ఎన్ శివప్రసాద్ యాదవ్, మెప్మా పీడీ సాయిబాబు, అగ్నిమాపక, మత్స్య శాఖాధికారులు ఏసురత్నం, అయ్యా నాగరాజా, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ సోమశేఖర్, పర్యాటక శాఖ అధికారి జి రామలక్ష్మణరావు, దేవాదాయ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జెసిబి తో మూడు దేవాలయాలు కూల్చివేత

## ప్రభుత్వ పోరంబోకు భూమిలో ఉన్న దేవాలయాలు కూల్చివేత



అవనిగడ్డ సెప్టెంబర్ 9 శ్రీ వార్త ప్రభుత్వ పోరంబోకు భూమిలో ఉన్న దేవాలయాలను రెవెన్యూ పోలీస్ పంచాయతీ సిబ్బంది జెసిబి తో తొలగించారు. అవనిగడ్డ నుండి అశ్వరావు పాలెం వెళ్లే రహదారి ప్రక్కన రెండు సంవత్సరాల క్రితం దేవాలయాలకు శంకుస్థాపన చేసి గత సంవత్సరం వేసవికాలంలో దేవాలయాలకు నిర్మాణం చేసి కనకదుర్గమ్మ మహాశివుడు గాయత్రి చిత్రపటాలను ఏర్పాటు చేసి అవునుగడ్డ నాలుగో వార్డుకు చెందిన రాజనాల అరుణకుమారి పూజలు నిర్వహిస్తుంది. ఈ తరుణంలో కొంతమంది దేవాలయాలను తొలగించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ తోపాటు పలువురికి అర్జీలు సమర్పించారు. అర్జీలు స్వీకరించిన ఉన్నతాధికారులు తహసిల్దార్ పోలీస్ పంచాయతీ సిబ్బందికి వెంటనే ప్రభుత్వ పోరంబోకులో ఉన్న ఆ దేవాలయాలను తొలగించాలని ఆదేశాలు ఇవ్వడంతో బుధవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆలయాలను నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా రాజనాల అరుణకుమారి మాట్లాడుతూ 70 సంవత్సరాలుగా వ్యవసాయ భూమి సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని ఇతరుణంలో అమ్మవారి పిలుపుమేరకు ఇక్కడ మూడు దేవస్థానాలను నిర్మించడం జరిగిందని అవనిగడ్డలో ఎన్నో దేవాలయాలు పోరంబోకు లోనే ఉన్నాయని అవి ఏమి అడ్డం రానివి నా దేవాలయమే అడ్డం వచ్చిందా అంటూ తగిన న్యాయం జరిగే వరకూ ఇక్కడే ఈ ప్రదేశంలోనే ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని ఆమె తెలిపింది, దేవాలయాల తొలగింపు కార్యక్రమాల్లో ఆర్ ఐ బాలాజీ. వీఆర్వోలు పోలీసులు పంచాయితీ కార్యదర్శి తోట శ్రీనివాసరావుతో పాటు పలువురు పాల్గొన్నారు,

## వైఎస్సార్‌సీపీ సమావేశంలో రామకృష్ణ

అనంతపురం: అనంతపురంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు. పార్టీ కార్యక్రమాలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని రామకృష్ణ సూచించారు. సమావేశంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిరుమలలో ప్రముఖుల ప్రత్యేక పూజలు

### పాల్గొన్న రావు రమేష్, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, రాయల్ మురళి



అనంతపురం, సెప్టెంబర్ 09 :కళా నట ప్రపూర్ణ కీర్తిశేషులు రావు గోపాల్ రావు కుమారుడు, ప్రముఖ సినీ నటుడు రావు రమేష్ కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థాన పాలకమండలి సభ్యుడు, మడకశిర శాసనసభ్యుడు ఎంఎస్ రాజుతో కలిసి వారు స్వామివారి దివ్య దర్శనం చేసుకున్నారు. అంతకుముందు తిరుమలకు చేరుకున్న వారికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాయల్ మురళి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ మండల కన్వీనర్ బాల రంగయ్య తదితరులు ఘన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లలో పాల్గొన్నారు. దర్శనానంతరం వేద పండితులు వారికి ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలను అందజేశారు.

## మీడియాతో మాట్లాడుతున్న యువ నేత గౌతమ్

## కూటమి నేతల్లారా మీ వర్గ పోరు పక్కన పెట్టి రైతాంగాన్ని ఆదుకోండి

### ప్రభుత్వంచే అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాలను కరువు మండలాలుగా ప్రకటింపచేయండి

### దివిసీమ పంట కాలువలలో నీరు కంటే రైతుల కళ్లల్లో కన్నీరు ఎక్కువగా ఉంది




అవనిగడ్డ సెప్టెంబర్ 9 శ్రీ వార్త మీ ప్రతిభ చూపేది పోటా పోటీ ర్యాలీలలో కాదని, ప్రభుత్వంచే దివిసీమ లోని అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాలను కరువు మండలాలుగా ప్రకటింప చెయ్యటంలో చూపాలని, ఇప్పటికే మీ పోటా పోటీ ప్రగల్భాలు నమ్మి నాట్లు వేసిన కొంత మంది రైతులు సాగు నీరు సక్రమంగా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బుధవారం యువనేత యువ న్యాయవాది గౌతమ్ అవనిగడ్డ తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ తీవ్రంగా విమర్శించారునేటికీ ఈ మూడు మండలాలలో ఉన్న వేలాది ఎకరాలకు చుక్క నీరు అందక సాగు చెయ్యలేని దీన స్థితిలో రైతులు ఉన్నారన్న విషయం తెల్సిందేనని, అయినా రైతుల ప్రయోజనాలను ఈ ప్రభుత్వం విస్మరించటం దారుణమని గౌతమ్ అన్నారు.నేటికైనా ప్రభుత్వానికి వాస్తవ పరిస్థితులు వివరించి అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాలను కరువు మండలాలుగా ప్రకటింప చేయాలని అందువలన రైతులకు గతంలో ఇచ్చిన రుణాల మాఫీ లేదా వెసులుబాటు, రుణాల వడ్డీలు మాఫీ, భూమి శిస్తు రద్దు, ప్రతి రైతుకు నష్ట పరిహారం, భవిష్యత్తు సాగు కొరకు కౌలు రైతులకు కూడా రుణ సదుపాయం కల్పించడం వంటి కొన్ని ప్రయోజనాలైనా రైతులకు సమకూరితే రైతులకు కొంత మేరైనా ప్రయోజనం కలుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేస్తూ వెంటనే స్థానిక కూటమి నేతలు సత్వర చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని వైసీపీ నేత గౌతమ్ డిమాండ్ చేశారు.

## కొవ్వొత్తులతో వికృతి ఆ పార్టీ నేతలు

## నిజమే గెలిచిందివైసీపీ పతనానికి పునాది పడిన రోజు




సెప్టెంబర్ 9 : విక్కుర్తిఅవనిగడ్డ సెప్టెంబర్ 9 శ్రీ వార్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడిని అక్రమంగా అరెస్టు చేసి 53 రోజుల పాటు జైలులో ఉంచిన చీకటి రోజును గుర్తుచేసుకుంటూ, బుధవారం అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిజం గెలిచింది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ప్రజాసేవకు అంకితమైన చంద్రబాబు నాయుడిని అక్రమ కేసులతో అరెస్టు చేసి 53 రోజుల పాటు నిర్బంధించడం నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమని విక్కుర్తి శ్రీనివాసరావు మండిపడ్డారు. సెప్టెంబర్ 9 తెలుగు జాతి చరిత్రలో ఎప్పటికీ మర్చిపోలేని చీకటి రోజుగా మిగిలిపోయిందని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబుపై ఎన్ని కుట్రలు, అవరోధాలు ఎదురైనా ఆయన నీతి, నిజాయితీ, ప్రజాసేవ ముందు నిజమే గెలిచిందని అన్నారు.ముందస్తు నోటీసు కూడా ఇవ్వకుండా ఒక మాజీ ముఖ్యమంత్రిని అర్ధరాత్రి వేళ అక్రమంగా అరెస్ట్ చేయడం తీవ్ర రాజ్యాంగ ఉల్లంఘన అని ధ్వజమెత్తారు. రాజకీయ కక్షసాధింపుతో, ఎటువంటి ప్రాథమిక ఆధారాలు లేకపోయినా ఆయనను 53 రోజుల పాటు జైల్లో బంధించారని, ఈ చర్య ప్రజాస్వామ్య విలువలను తీవ్రంగా కాలరాసిందని విమర్శించారు. చట్టాన్ని పక్కనబెట్టి, విచారణ పేరిట వేధించడం వ్యవస్థల పతనానికి అద్దం పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, నాయకుడు జైలుకెళ్లినా ప్రజాభిమానం ఏమాత్రం తగ్గలేదని, అన్ని వైపుల నుంచి వ్యక్తమైన నిరసనలు, మద్దతుతో చివరకు న్యాయమే గెలిచిందని అన్నారు. ఈ 53 రోజుల ఘటన ప్రజాస్వామ్య చరిత్రలో ఒక నల్లని రోజుగా మిగిలిపోతుందని స్పష్టం చేశారు.అనంతరం, నాయకులు మరియు కార్యకర్తలు ఆ చీకటి రోజులకు నిరసనగా కొవ్వొత్తులు వెలిగించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నాడు 53 రోజులు జైలు... నేడు ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రి - ఇదే ప్రజల తీర్పు: గోపు సత్యనారాయణ



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడును 09-09-2023న అప్పటి వైసీపీ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి 53 రోజులు జైలులో నిర్బంధించిన ఘటనకు నేటితో మూడేళ్లు పూర్తయిన సందర్భంగా, నాడు జైలులో ఉన్న నాయకుడు నేడు ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని, ఇదే ప్రజల తీర్పు అని కృష్ణా జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ అన్నారు.బందరు మండలం కనూరు పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం టీడీపీ ఆధ్వర్యంలో



నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.చంద్రబాబును 53 రోజులు జైలులో ఉంచినా ఆయన ధైర్యంగా న్యాయపోరాటం చేశారని, ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా ప్రజల కోసం ఆయన చేసిన పోరాటాన్ని ప్రజలు మరచిపోలేదని అన్నారు. చివరికి న్యాయమే గెలిచిందని, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు కూటమికి 164 అసెంబ్లీ స్థానాల అఖండ విజయాన్ని అందించి చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారని తెలిపారు.అధికారం శాశ్వతం కాదని, ప్రజల తీర్పే అంతిమమని ఈ పరిణామం మరోసారి నిరూపించిందని పేర్కొన్నారు.అనంతరం చంద్రబాబు జైలులో గడిపిన 53 రోజులకు గుర్తుగా 53 కొవ్వొత్తులను వెలిగించి సంఘీభావం తెలిపారు. “నాడు జైలు... నేడు ముఖ్యమంత్రి - ఇదే ప్రజల తీర్పు” అంటూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్ దుర్మార్గం - ప్రజాస్వామ్యంలో బ్లాక్ డే: బడే నాగజ్యోతి



ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 9శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడం దుర్మార్గమైన చర్య అని, ఇది ప్రజాస్వామ్యంలో మరో బ్లాక్ డే అని బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి తీవ్రంగా ఖండించారు. ములుగులో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు.ప్రజా సమస్యలపై చర్చకు భయపడే రేవంత్ సర్కార్ కుట్రలో భాగంగానే ఈ సస్పెన్షన్ జరిగిందని ఆరోపించారు. ముఖ్యంగా 22 ఏ భూముల సమస్య సహా రాష్ట్రంలో నెలకొన్న కీలక ప్రజా సమస్యలు శాసనసభలో చర్చకు రాకుండా అడ్డుకునేందుకే ప్రతిపక్ష ఎమ్మెల్యేల గొంతు నొక్కుతున్నారని విమర్శించారు.ప్రజల గొంతుకగా నిలబడి ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని మండిపడ్డారు. ప్రజా సమస్యలకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం, ప్రశ్నించే ప్రతిపక్షాన్ని అణచివేయడం సరికాదన్నారు.ప్రశ్నిస్తే సస్పెన్షన్, నిలదీస్తే చర్యలు ఇదేనా కాంగ్రెస్ చెప్పే ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. అధికార బలంతో ప్రతిపక్ష గొంతును అణచివేయవచ్చేమో కానీ ప్రజల గొంతును మాత్రం అణచివేయలేరని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ పోరాటం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదని, ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నిస్తూనే ఉంటామని బడే నాగజ్యోతి హెచ్చరించారు.

# వరిలో కలుపు నివారణపై రైతులు అవగాహన పెంచుకోవాలి: జేడీఏ జ్యోతి రమణి

పామర్రు మండలంలో
'పొలం పిలుస్తుంది' కార్యక్రమం
.వరి క్షేత్రాలను స్వయంగా పరిశీలించిన జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు .
కలుపు నివారణ, యాజమాన్య పద్ధతులపై రైతులకు కీలక ఆదేశాలు.
పంట నమోదు ఈ కేవైసీ ఈ నెల 15 లోపు చేయించుకోవాలని సూచన







పామర్రు శ్రీ వార్త న్యూస్ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలో కొండివర్రు,,రిమ్మనపూడి గ్రామాలలో నిర్వహించిన 'పొలం పిలుస్తుంది' కార్యక్రమంలో కృష్ణా జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు కె .జ్యోతి రమణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని వరి సాగు క్షేత్రాలను ఆమె స్థానిక వ్యవసాయ అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ప్రస్తుతం వరి పంట ఎదుగుదల దశలో ఉందని, ఈ సమయంలో కలుపు మొక్కల వల్ల ఆశించిన దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని రైతులను హెచ్చరించారు. పంటకు వేసే ఎరువులు కలుపు మొక్కలు గ్రహించకుండా ఉండాలంటే సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.

**వరిలో కలుపు నివారణపై జ్యోతి రమణి ముఖ్య**

**సూచనలు:**

**సకాలంలో నివారణ: వరి నాట్లు వేసిన లేదా విత్తిన 20 నుండి 25 రోజుల లోపు**

కలుపు నివారణ మందులను సరైన మోతాదులో పిచికారీ చేయాలి.కలుపు నివారణ మందుల వాడకంలో వెడల్పాటి ఆకు కలుపు, గడ్డి జాతి కలుపు మొక్కల నివారణకు సిఫార్సు చేసిన రసాయన కలుపు నాశకాలను మాత్రమే వాడాలని, నిపుణుల సలహా మేరకు ఎకరాకు సరిపడా మోతాదును మాత్రమే పిచికారీ చేయాలని తెలిపారు.నీటి యాజమాన్యం: కలుపు మందులు పిచికారీ చేసే సమయంలో పొలంలో పలచగా నీరు ఉండాలని, మందు చల్లిన రెండు మూడు రోజుల వరకు నీరు పెట్టడం లేదా తీసివేయడం వంటివి చేయకూడదని వివరించారు.సాధ్యమైనంత వరకు కోనోవీడర్ వంటి ఆధునిక యంత్రాల ద్వారా కలుపును భూమిలోనే తొలగించడం వల్ల భూమికి గాలి ఆడి, వేరు వ్యవస్థ బలంగా తయారవుతుందని రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పామర్రు వ్యవసాయ సహాయ సంచాలకులు స్వర్ణలత మండల వ్యవసాయ అధికారిణి వి శివ నాగరాణి సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు శేఖర్ స్థానిక రైతన్నలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల నూతన దరఖాస్తుల స్వీకరణ

### అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలి: ...పామర్రు డిప్యూటీ ఎంపీడీవో బొమ్మసాని వెంకట సుబ్బారావు



పామర్రు శ్రీ వార్త న్యూస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల నూతన దరఖాస్తుల స్వీకరణ మరియు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలో అర్హత గల ప్రతి ఒక్కరికి న్యాయం చేకూర్చే బాధ్యత గ్రామ సచివాలయ ఉద్యోగులు దేనని పామర్రు మండల డిప్యూటీ ఎంపీడీవో బొమ్మసాని వెంకట సుబ్బారావు అన్నారు.బుధవారం మండల పరిధిలోని పలు గ్రామ సచివాలయాలను సందర్శించి అయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల్లో దరఖాస్తుల కంప్యూటరైజేషన్ విధానాన్ని, సిబ్బంది హాజరును, రికార్డులను వారు నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నూతన పింఛన్ల కోసం అర్హులైన లబ్ధిదారుల నుండి వచ్చిన దరఖాస్తుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ప్రతి ఒక్క పేదవాడికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందేలా సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని డిప్యూటీ ఎంపీడీవో బొమ్మసాని వెంకట సుబ్బారావు ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, ప్రజల నుండి వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ సహాయకులు వెంకట కిషోర్, కంఠమనేని పల్లవి, వైష్ణవి, కే జ్యోతి, డిజిటల్ అసిస్టెంట్లు నరేంద్ర, హుస్సేన్, నవీన్,రాజు, సచివాలయాల అడ్మిన్ కార్యదర్శులు నేరుసు నరేష్, ఆరేపల్లి తిరుమల, బోసు బాబు, మహిళా సంరక్షణ కార్యదర్శులు పులిగడ్డ రాజేశ్వరి, స్వాతి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.దరఖాస్తుల స్వీకరణ, నమోదులో సుబ్బారావు జారీ చేసిన కీలక సూచనలు:సత్వర నమోదు : లబ్ధిదారుల నుండి వచ్చిన కొత్త దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. ఎట్టి ల్లోనూ దరఖాస్తులను సచివాలయాల్లో పెండింగ్‌లో ఉంచకూడదు. ఆధారాల పక్కా పరిశీలన : ఆధార్ కార్డ్, బ్యాంక్ పాస్ బుక్, వయస్సు ధృవీకరణ పత్రాలు మరియు రేషన్ కార్డ్ (రైస్ కార్డ్) వివరాలను ఆన్‌లైన్ లో నమోదు చేసేటప్పుడు డిజిటల్ అసిస్టెంట్లు ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్త వహించాలి .క్షేత్రస్థాయి అర్హత పరిశీలన : నూతన దరఖాస్తు దారుల ఇళ్లను వెల్ఫేర్ అసిస్టెంట్లు స్వయంగా సందర్శించి, వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులేనా కాదా అని నిష్పక్షపాతంగా నివేదిక సిద్ధం చేయాలి.

**సహాయ కేంద్రాల ఏర్పాటు :**

సచివాలయానికి వచ్చే వృద్ధులు, వికలాంగులు మరియు ఒంటరి మహిళలకు దరఖాస్తు ఫారాలు నింపడంలో డిజిటల్ అసిస్టెంట్లు, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు పూర్తిగా సహకరించాలి.జవాబుదారీతనం :ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ఎంపిక ప్రక్రియలో రాజకీయాలకు అతీతంగా, కేవలం అర్హతను మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలి. అర్హుడైన ఒక్క పేదవాడు కూడా సాంకేతిక కారణాల వల్ల పింఛన్ కోల్పోకూడదు.

## కబ్జాకోరల్లో చెరువులు, కుంటలు.. నిద్రమత్తులో కాగజ్ నగర్ ఇరిగేషన్ అధికారులు!

## సిర్పూర్-టి నియోజకవర్గంలో చెలరేగుతున్న భూమాఫియా.. స్పందించని అధికారులపై వేటు వేయాలని రైతన్నల ఆగ్రహం




కాగజ్ నగర్ సెప్టెంబర్ 09 ప్రతిని దుర్గం శరత్ చంద్ర కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్-టి నియోజకవర్గంలో నీటి వనరులు అన్యాక్రాంతమవుతున్నా, చెరువులు, కుంటల భూములు కబ్జాకోరల్లో చిక్కుకుంటున్నా ఇరిగేషన్ శాఖ అధికారులు మాత్రం గాఢ నిద్రలో జోగుతున్నారు. అన్నదాతల కన్నీళ్లు, హెచ్చరికలను బేఖాతరు చేస్తూ స్థానిక అధికారులు చోద్యం చూస్తుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గంలోని పలు మండలాల్లో చెరువులు, కుంటలకు సంబంధించిన శిఖం భూములు, గుంటలు రోజురోజుకూ అన్యాక్రాంతం అవుతున్నా, సంబంధిత శాఖ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.?ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పరిరక్షించాల్సిన నీటి వనరులు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్తున్న వైనంపై రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుంటలు, చెరువుల భూములు కబ్జాకు గురవుతున్న విషయాన్ని బాధితులు, స్థానిక రైతులు ఎన్నోసార్లు సంబంధిత ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసినా అధికారుల స్పందన మాత్రం శూన్యంగా మారింది. 'వస్తాం, పరిశీలిస్తాం, రెవెన్యూ అధికారులతో మాట్లాడి హద్దులు నిర్మిస్తాం' అంటూ కాలయాపన తప్ప ఆచరణలో ఎలాంటి చర్యలు ఉండటం లేదని రైతులు మండిపడుతున్నారు. నెలనెలా ప్రభుత్వ ఖజానా నుండి వేలాది రూపాయల జీతాలు మాత్రం క్రమం తప్పకుండా తీసుకుంటున్న అధికారులు, తమ బాధ్యతలను విస్మరించి కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారంటూ రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.?కాగజ్ నగర్ మండలంలోని ఇరిగేషన్ శాఖ అధికారుల పనితీరుపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమస్య తీవ్రతను అధికారులకు వివరిస్తే నిర్లక్ష్యపు సమాధానాలు ఇస్తూ కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారులు ఈ వ్యవధిపై ప్రత్యేక దృష్టి సారించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. చెరువులు, కుంటల భూములను కబ్జా చేస్తున్న అసాంఘిక శక్తులు, భూమాఫియాపై ఉక్కుపాదం మోపాలని కోరుతున్నారు. అదేవిధంగా, ప్రజాధనంతో జీతాలు తీసుకుంటూ విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న ఇరిగేషన్ అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని, విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని సిర్పూర్-టి నియోజకవర్గ రైతాంగం డిమాండ్ చేస్తోంది. నిర్లక్ష్య వైఖరిని వీడకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

## కాళోజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

### మల్లంపల్లి మండల సాధన సమితి అధ్యక్షులు గోల్కొండ రాజు

మల్లంపల్లి, సెప్టెంబర్ 9 : ప్రజాకవి కాళోజీ నారాయణరావు ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకెళ్లాలని మల్లంపల్లి మండల సాధన సమితి అధ్యక్షులు గోల్కొండ రాజు అన్నారు.కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల సమస్యలను తన రచనలు, కవితల ద్వారా సమాజం దృష్టికి తీసుకువచ్చిన గొప్ప ప్రజాకవి కాళోజీ అని అన్నారు. సామాన్య ప్రజల పక్షాన నిలిచి, అన్యాయం, అక్రమాలు, అణచివేతకు వ్యతిరేకంగా తన కలాన్ని అక్షరాయుధంగా మలిచారని పేర్కొన్నారు.తెలంగాణ భాష, యాస, సంస్కృతిపై కాళోజీకి ఉన్న అభిమానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని గోల్కొండ రాజు అన్నారు. ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించడం సముచిత గౌరవమని తెలిపారు.మల్లంపల్లి ప్రాంత ప్రజల హక్కులు, అభివృద్ధి కోసం కూడా ప్రజా ఉద్యమాల ద్వారా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కాళోజీ స్ఫూర్తితో ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తూ, ప్రజా ప్రయోజనాల కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## దళితుల జీవితాల్లో వెలుగులు నింపిన మహానాయకుడు కేసీఆర్ - బీఆర్ఎస్ నాయకులు రేణుకుంట్ల సురేష్




ములుగు, సెప్టెంబర్ 9 దళిత కుటుంబాల ఆర్థిక స్వావలంబన కోసం ఒక్కో కుటుంబానికి రూ. 10 లక్షలను 100% గ్రాంట్ కింద అందించే చారిత్రాత్మక దళిత బంధు పథకాన్ని తీసుకొచ్చిన మహానాయకుడు కేసీఆర్ గారేనని బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా దళిత నాయకులు రేణుకుంట్ల సురేష్ అన్నారు.దళితుల ఆత్మగౌరవం, ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా కేసీఆర్ ఈ పథకాన్ని తీసుకొచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం దళిత వ్యతిరేకి అని ముద్ర వేసే ప్రయత్నం చేస్తున్నా కేసీఆర్ గారికి దళితుల మీద ఉన్న ప్రేమ తెలంగాణలో ఏ నాయకుడికి లేదని అన్నారు.దళితుడు ఎవరి మీదా ఆధారపడకూడదు, తన కాళ్లపై తాను నిలబడాలనే లక్ష్యంతో అణగారిన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా దళితుల చేతికి ఆర్థిక బలాన్ని అందించిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. దళితుల సంక్షేమానికి బాట వేసిన నాయకత్వం, ఆత్మగౌరవానికి అండగా నిలిచిన నాయకత్వం కేసీఆర్ గారిదేనని తెలిపారు.

## అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రిలో జనరల్ సర్జరీ సేవలకు శ్రీకారం

మొదటి శస్త్రచికిత్స విజయవంతం....



అశ్వారావుపేట ఆర్సి/ సెప్టెంబర్ 9 అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రిలో జనరల్ సర్జరీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఇప్పటివరకు శస్త్రచికిత్సల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన రోగులకు ఇకపై స్థానికంగానే వైద్య సేవలు పొందే అవకాశం కలిగింది. ఆసుపత్రిలో కొత్తగా ఐదుగురు వైద్యులు విధుల్లో చేరడంతో వైద్య సేవలను మరింత విస్తరించారు.జనరల్ సర్జన్ డాక్టర్ అంబటి శైలేంద్ర కుమార్ ఆధ్వర్యంలో దమ్మపేట మండలానికి చెందిన మొడియం జ్యోతికి మోకాలి పైభాగంలో ఉన్న కణితిని తక్కువ మోతాదులో మత్తు మందు ఇచ్చి విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.జనరల్ సర్జరీ సేవలు ప్రారంభం కావడంతోఅశ్వారావుపేటతో పాటు పరిసర మండలాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలగనుంది. శస్త్రచికిత్సల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు, ప్రయాణ ఖర్చులు తగ్గనున్నాయి. స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడంపై రోగులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధా రుక్మిణి మాట్లాడుతూ.. ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్తులో ప్రజలకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అశ్వారావుపేట ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు సహకరిస్తున్న స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి రవిబాబులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జనరల్ సర్జన్ డాక్టర్ అంబటి శైలేంద్ర కుమార్, మత్తు వైద్య నిపుణురాలు డాక్టర్ మౌనిక, వైద్యాధికారి డాక్టర్ మౌనిక, ప్రధాన నర్సింగ్ అధికారి వర్ధిని, శస్త్రచికిత్స గది నర్సింగ్ అధికారి సుజాతతో పాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.స్థానికంగానే జనరల్ సర్జరీ సేవలు అందుబాటులోకి రావడంతో అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రి వైద్య సేవల విస్తరణలో మరో కీలక ముందడుగు వేసినట్లైంది.




## గిరిజన బాలుర హాస్టల్‌లో నీటి కష్టాలు.. విద్యార్థుల ర్యాలీ
## స్పందించిన డిప్యూటీ కలెక్టర్.. వెంటనే బోరు మోటర్ మంజూరు



అశ్వరావుపేట ఆర్సి / సెప్టెంబర్ 9 :స్థానిక గిరిజన బాలుర వసతి గృహంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హాస్టల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించి డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల సమస్యలకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు.సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్, మండల కన్వీనర్ మురారి రఘు విద్యార్థులతో కలిసి డిప్యూటీ కలెక్టర్‌ను కలిసి హాస్టల్‌లో నెలకొన్న నీటి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన బాలుర వసతి గృహంలో ఇప్పటివరకు బోరు మోటర్ లేకపోవడంతో విద్యార్థులు వీధి కుళాయిలపైనే ఆధారపడి రోజువారీ అవసరాలు తీర్చుకోవాల్సి వస్తోందన్నారు. గత ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీరు కూడా సరఫరా కాకపోవడంతో కాలకృత్యాలు తీర్చుకోవడానికి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.విద్యార్థుల సమస్యపై వెంటనే స్పందించిన డిప్యూటీ కలెక్టర్ ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, హాస్టల్ వార్డెన్‌ను పిలిపించి సమస్య తీవ్రతను తెలుసుకున్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే బోరు మోటర్ మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అధికారుల తక్షణ స్పందనతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి డిప్యూటీ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## అంగన్‌వాడీ ఉద్యోగుల
## అరెస్టులకు నిరసనగా దమ్మపేటలో సీఐటీయూ ధర్నా....



అశ్వరావుపేట ఆర్సి / సెప్టెంబర్ 9అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారంహైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన ధర్నాకువెళ్తున్నఅంగన్‌వాడీ ఉద్యోగులను, అలాగే హైదరాబాద్‌లో ధర్నా నిర్వహిస్తున్న రాష్ట్ర నాయకత్వాన్ని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ దమ్మపేటలో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన ఈ ఆందోళన అనంతరం డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రంఅందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ మురారి రఘు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులు తీవ్ర పని భారంతో సతమతమవుతున్నారని అన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నప్పటికీ, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పీఎంసీ, ప్రీ ప్రైమరీ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సూరమ్మ, జయ, వెంకటలక్ష్మి, సీతారామమ్మ, వజ్రమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌కు ప్రాణహాని కుట్రపై
## దమ్మపేట పోలీసులకు బీఆర్‌ఎస్ ఫిర్యాదు




అశ్వరావుపేట ఆర్సి / సెప్టెంబర్ 9 మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు ప్రాణహాని కలిగించే కుట్ర జరిగిందనే ఆరోపణలపై దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో బీఆర్‌ఎస్ శ్రేణులు ఫిర్యాదు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదేశాల మేరకు, నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సూచనలతో బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం దమ్మపేట పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఎస్ఐ బాలస్వామికి ఫిర్యాదు అందజేశారు. అసెంబ్లీలో చోటుచేసుకున్న పరిణామాలు, షాద్‌నగర్ ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్ చేసిన తీవ్ర వ్యాఖ్యలు, అనంతరం పెద్ద సంఖ్యలో వాహనాల్లో వ్యక్తులు కేసీఆర్ నివాసముంటున్న ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వైపు వెళ్లిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఫిర్యాదులో కోరినట్లు నాయకులు తెలిపారు.కేసీఆర్‌ను చంపాలంటూ చేసినట్లు ప్రచారంలోకి వచ్చిన వ్యాఖ్యలు, టీవీ, సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియోలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి వాస్తవాలను వెలుగులోకి తేవాలని పోలీసులను కోరారు. గత కొంతకాలంగా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుపై కూడా నిరాధార ఆరోపణలతో కేసులు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.కేసీఆర్‌పై గతంలో చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవమానకర వ్యాఖ్యలు, అసెంబ్లీ వేదికగా చేసిన బెదిరింపు ధోరణి వ్యాఖ్యలను సైతం పరిగణనలోకి తీసుకుని సమగ్ర విచారణ చేపట్టాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు.ఫిర్యాదు చేసిన వారిలో మాజీ మండల ఉపాధ్యక్షుడు గాజుబోయిన యేసుబాబు, మండల సీనియర్ నాయకులు దారా యుగంధర్, అబ్దుల్ జిన్నా, సర్పంచ్ యట్ల రామదాసు, వార్డు సభ్యులు దారా రాము, ఉయ్యాల లక్ష్మీనారాయణ, మాజీ కోఆప్షన్ ఎంపీటీసీ బుడే, వెలుగోటి మహేష్, పాకనాటి శ్రీను, మాజీ ఎంపీటీసీ కాసిని శ్రీను, కొలికపోగు ధర్మ, కొలూరి నాగయ్య, బండ్ల లక్ష్మయ్య, దండబత్తుల కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



# భూ సర్వేతో భవిష్యత్తుకు భరోసా!

సమగ్ర పునఃసర్వేలో తప్పిదాలకు తావులేకుండా చూడాలి..

మద్నూర్‌లో క్షేత్రస్థాయిలో పరిశీలించిన బాన్సువాడ రెవెన్యూ డివిజన్ అధికారి రవీందర్ రెడ్డి



జుక్కల్ సెప్టెంబర్ 09:భూమి హద్దులు.. రైతుల హక్కులు.. ఓటర్ల వివరాలు.. ప్రజా సమస్యలు.. ఇలా ఒకే రోజు పలు అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో దృష్టి సారించారు. బాన్సువాడ రెవెన్యూ డివిజన్ అధికారి రవీందర్ రెడ్డి బుధవారం మద్నూర్ మండలంలో విస్తృతంగా పర్యటించి వివిధ కార్యక్రమాలను పరిశీలించారు ఓటర్ల వివరాల పరిశీలన కేంద్రాల్లో తనిఖీమద్నూర్ మండలం పెద్ద ఎక్లార గ్రామంలో కొనసాగుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర పునఃపరిశీలన కేంద్రాలను రవీందర్ రెడ్డి పరిశీలించారు. విచారణకు హాజరైన ఓటర్లతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. ధ్రువపత్రాల సమర్పణ, వివరాల నమోదు, పత్రాల నిక్షేపణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.కాలువ.. పొలాల దారిపై క్షేత్రస్థాయి పరిశీలనమేనూర్ గ్రామ శివారులో పంట కాలువ, పంట పొలాలకు వెళ్లే దారికి సంబంధించి వచ్చిన ఫిర్యాదుపై రెవెన్యూ డివిజన్ అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. తహసీల్దార్, భూమి కొలతల అధికారి, గిర్దావర్‌లతో కలిసి సంబంధిత భూములు, కాలువలను పరిశీలించారు. నీటిపారుదల శాఖ అధికారులు, భూమి కొలతల అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

### నక్షలు లేవు..
### పటాలు లేవు.. అయినా పునఃసర్వే!

సోమూర్ గ్రామంలో గత రెండు నెలలుగా కొనసాగుతున్న భూముల పునఃసర్వే పనులను రవీందర్ రెడ్డి పరిశీలించారు. గ్రామానికి సంబంధించిన నక్షలు, పటాలు అందుబాటులో లేకపోవడంతో గ్రామ సరిహద్దులు, పంట పొలాలు, పట్టాదారుల భూములు, ప్రభుత్వ భూములను గుర్తిస్తూ హద్దులు ఏర్పాటు చేస్తున్నారు.పత్తి, సోయా పంట పొలాల్లోకి వెళ్లిన రెవెన్యూ డివిజన్ అధికారి సర్వే జరుగుతున్న తీరును స్వయంగా పరిశీలించారు. రైతులతో మాట్లాడి పునఃసర్వేలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు."భూ వివాదాలు తగ్గుతాయి".. రైతుల ఆనందంపునఃసర్వేపై రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల తర్వాత ప్రభుత్వం భూముల సర్వే చేపట్టి హద్దులు గుర్తించడం, నక్షలు--పటాలు రూపొందించడం వల్ల భవిష్యత్తులో భూ వివాదాలు తగ్గే అవకాశం ఉందని తెలిపారు. భూములకు సంబంధించిన వివరాలు స్పష్టంగా ఉండటం వల్ల తమకు ఎంతో లబ్ధి చేకూరుతుందని రైతులు పేర్కొన్నారు. కాళోజీకి ఘన నివాళిఅనంతరం మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి రవీందర్ రెడ్డి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రజా కవులు, రచయితల రచనలు ప్రజల్లో చైతన్యం కలిగించాయని గుర్తుచేశారు. మహనీయుల ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మద్నూర్ తహసీల్దార్ ఎం.డి. ముజీబ్, డీఐ తిరుమలేశ్, భూమి కొలతల అధికారి వెంకటి, గిర్దావర్ మురళీధర్, జూనియర్ సహాయకుడు రవికుమార్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, రైతులు, అనుమతి పొందిన భూమి కొలతల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా కవి కాళోజీ నారాయణరావు ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి







వనపర్తి జిల్లా ప్రతినిధి బాలరాజు 9 సెప్టెంబర్ 2026 బుధవారంబుధవారం వనపర్తి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (×ణుజా)లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్‌తో కలిసి కాళోజీ నారాయణరావు చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల హక్కులు, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం తన రచనలు, ఉద్యమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. తన రచనల ద్వారా సామాన్య ప్రజల సమస్యలను, వారి ఆకాంక్షలను సమాజం ముందుకు తీసుకువచ్చారని పేర్కొన్నారు.కాళోజీ సాహిత్యం ప్రజల జీవితాలకు అద్దం పట్టిందని, ఆయన రచనలు నేటి తరానికి కూడా స్ఫూర్తినిస్తాయని కలెక్టర్ తెలిపారు. సమాజంలో అసమానతలు తొలగించి, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ, ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు.కాళోజీ నారాయణరావు చూపిన మార్గంలో ప్రజల్లో సామాజిక చైతన్యం పెంపొందించేందుకు కృషి చేయాలని, ఆయన ఆశయాలను భావితరాలకు అందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏవో భాను ప్రకాష్, డి పి ఆర్ ఓ సీతారాం, బీసీ సంక్షేమ శాఖ అధికారిని ప్రమీల, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సిరాజుద్దీన్, కార్మిక శాఖ అధికారి రవి, జిల్లా అధికారులు, ప్రజా సంఘాల నాయకులు గంధం నాగరాజు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన ఏ ఆర్ అదనపు ఎస్పీ

అన్యాయంపై అక్షర సమరం చేసిన ప్రజాకవి కాళోజీ. ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో కాళోజీ సాహిత్యం కీలక పాత్రవీరారెడ్డి



వనపర్తి జిల్లా ప్రతినిధి బాలరాజు 9 సెప్టెంబర్ 2026 బుధవారంబుధవారం రోజు వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో తెలంగాణ ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజా ఉద్యమాల గొంతుక శ్రీ కాళోజీ నారాయణరావు జయంతి కార్యక్రమాన్ని ఏ ఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి పోలీసు కార్యాలయం అధికారులు, సిబ్బంది కలిసి కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.."ప్రజల బాధను తన బాధగా భావించి, అన్యాయాన్ని నిర్భయంగా ప్రశ్నించిన మహోన్నత ప్రజాకవి కాళోజీ నారాయణరావు. తన కలం ద్వారా సమాజంలోని అసమానతలు, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి ప్రజల్లో చైతన్యాన్ని రగిలించిన ఆయన సేవలు చిరస్మరణీయం. కాళోజీ సాహిత్యం కేవలం రచనలకు పరిమితం కాకుండా ప్రజా చైతన్యానికి ఒక ఉద్యమంగా నిలిచింది. ఆయన ఆశయాల స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలి. పోలీసు అధికారులు, సిబ్బంది కూడా ప్రజల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకుని, నిష్పక్షపాతంగా, అంకితభావంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కాళోజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని అదనపు ఎస్పీపిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పీ, బాలాజీ నాయక్, పోలీస్ కార్యాలయం ఏఓ, సునంద, స్పెషల్ స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సైలు,పర్వతాలు, రామేశ్వర్ రెడ్డి, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు, వినోద్, మగ్దుం భారీ, పోలీసు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, గోవింద్, పోలీస్ సిబ్బంది, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీ వార్త
జాతీయ తెలుగు దినపత్రిక
కొత్త ఆలోచన.. కొత్త వార్త
గురువారం - 10 - సెప్టెంబర్ - 2026

# వ్యాయామం చేయకుండానే చెమట పడుతోందా? గుండె ఇచ్చే ఈ సంకేతాలను గమనించండి!

కారణం లేకుండా చెమట పడితే జాగ్రత్త

చల్లటి చెమట గుండెపోటు సంకేతం కావొచ్చంటున్న నిపుణులు

ఛాతీలో అసౌకర్యంతో చెమట వస్తే నిర్లక్ష్యం చేయొద్దు

ఆయాసం, తలతిరగడం ఉంటే అప్రమత్తంగా ఉండాలని సూచన

రోజువారీ పనుల్లో అధిక చెమటను గమనించాలని సలహా



చెమట పట్టడం సహజమే. ఎండలో ఉన్నప్పుడు, వ్యాయామం చేసినప్పుడు లేదా ఒత్తిడికి గురైనప్పుడు చెమట రావడం సాధారణం. కానీ ఎలాంటి కారణం లేకుండానే ఒక్కసారిగా విపరీతంగా చెమట పడితే మాత్రం కాస్త జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా ఛాతీలో అసౌకర్యం, ఆయాసం, వికారం, తల తిరగడం లేదా అకస్మాత్తుగా నీరసం వంటి లక్షణాలు కూడా ఉంటే దాన్ని తేలిగ్గా తీసుకోకూడదు.



గుండె సమస్యతో చెమట ఎందుకు పడుతుంది?

గుండెపై తీవ్ర ఒత్తిడి పడినప్పుడు శరీరం అత్యవసర పరిస్థితిలో ఉన్నట్లు స్పందిస్తుంది. గుండెపోటు సమయంలో సింపథెటిక్ నాడీ వ్యవస్థ చురుగ్గా పనిచేస్తుంది. దీంతో గుండె వేగం పెరగడం, రక్తపోటులో మార్పులు రావడం, చెమట గ్రంథులు ఎక్కువగా పనిచేయడం జరుగుతుంది.

అప్పుడు ఒక్కసారిగా చల్లటి చెమటలు పట్టొచ్చు. చర్మం వేడిగా కాకుండా తడిగా, జిగటగా అనిపించొచ్చు. ఊరికే కూర్చున్నా ఈ పరిస్థితి రావచ్చు.

ఇతర లక్షణాలు ఉంటే మరింత జాగ్రత్త

చెమట ఒక్కటే వస్తే గుండె సమస్య అని చెప్పలేం. జ్వరం, ఆందోళన, రక్తంలో చక్కెర తగ్గడం, హార్మోన్ల మార్పులు, ఇన్ఫెక్షన్లు, కొన్ని మందుల వల్ల కూడా చెమట పట్టొచ్చు. అయితే చెమటతో పాటు ఛాతీలో బిగుతు లేదా భారంగా అనిపించడం, చేయి, భుజం, వీపు, మెడ లేదా దవడ భాగంలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వాంతులు, తల తిరగడం, తీవ్రమైన నీరసం, గుండె వేగం మారడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి.





### రోజువారీ పనుల్లోనూ చెమట ఎక్కువగా వస్తోందా?

ఇంతకుముందు సులభంగా చేసిన పనికే ఇప్పుడు విపరీతంగా చెమట పడుతోందా? మెట్లు ఎక్కడం, నడవడం లేదా ఇంటి పనులు చేస్తున్నప్పుడు చెమటతో పాటు ఆయాసం, ఛాతీలో అసౌకర్యం వస్తోందా? అయితే వైద్యుడిని సంప్రదించడం మంచిది. ఉదాహరణకు గతంలో 30 నిమిషాలు సులభంగా నడిచిన వ్యక్తికి ఇప్పుడు 10 నిమిషాలకే చెమట, ఆయాసం, నీరసం వస్తే.. ఆ మార్పును గమనించాలి.

### రాత్రిపూట చెమట పడితే?

రాత్రి చెమట పట్టడానికి చాలా కారణాలు ఉండొచ్చు. గది వేడిగా ఉండటం, ఇన్ఫెక్షన్లు, హార్మోన్ల మార్పులు, కొన్ని మందులు ఇందుకు కారణం కావచ్చు. అయితే రాత్రిపూట చెమటతో పాటు ఛాతీలో అసౌకర్యం, ఆయాసం, గుండె దడ లేదా నిద్ర నుంచి నీరసంతో మేల్కొనే పరిస్థితి పదేపదే వస్తే వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిది.

### ఎప్పుడు అత్యవసర చికిత్స అవసరం?

ఒక్కసారిగా విపరీతమైన చెమటతో పాటు ఛాతీలో అసౌకర్యం, శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది, స్పృహ తప్పే పరిస్థితి, తీవ్రమైన నీరసం లేదా చేయి, దవడ, వీపు, భుజానికి నొప్పి ఉంటే వెంటనే అత్యవసర వైద్య సహాయం తీసుకోవాలి. లక్షణాలు కొన్ని నిమిషాల్లో తగ్గిపోయినా నిర్లక్ష్యం చేయకూడదు. కొన్ని గుండె సమస్యల్లో లక్షణాలు వచ్చి తగ్గుతూ ఉండొచ్చు.

మీకు సాధారణంగా ఎంత చెమట పడుతుందో తెలుసుకోవడం ముఖ్యం. సాధారణానికి భిన్నంగా ఒక్కసారిగా చల్లటి చెమటలు పట్టడం, ముఖ్యంగా ఇతర లక్షణాలతో కలిసి కనిపించడం గమనించాల్సిన సంకేతం. ఎప్పుడు చెమట పడుతోంది? ఎంతసేపు ఉంటోంది? ఆ సమయంలో ఏ లక్షణాలు కనిపిస్తున్నాయో గుర్తుపెట్టుకుంటే వైద్యుడికి పరిస్థితిని వివరించడంలో ఉపయోగపడుతుంది.

# గుడ్డు తాజాగా ఉందో? లేదో? 10 సెకన్లలో తెలుసుకోండి..

ఎఫ్ఎస్ఎస్ఏఐ టిప్ ఇదే!

నీటితో గుడ్డు తాజాదనం తెలుసుకునే అవకాశం

అడుగున అడ్డంగా ఉంటే గుడ్డు తాజాగా ఉన్నట్లేనని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచన

నిలువుగా ఉంటే గుడ్డు పాతదని అర్థమని వెల్లడి



ఫ్రిజ్ తెరిచారు.. అందులో కొన్ని రోజులుగా ఉన్న గుడ్లు కనిపించాయి. అవి తాజాగా ఉన్నాయా? తినొచ్చా? అనే సందేహం రావడం సహజమే. పెంకును చూస్తే గుడ్డు పరిస్థితి తెలియదు. అలాగే అమ్మినవాళ్లు తాజావే ఇచ్చారా? అనే అనుమానమూ వస్తుంటుంది. అయితే ఇకపై అలాంటి సందేహాలు అవసరం లేదు. ఇంట్లో ఉన్న నీళ్లతోనే గుడ్డు తాజాగా ఉందో? పాతదైందో సులభంగా తెలుసుకోవచ్చు. 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా' (ఎఫ్ఎస్-ఎస్ఏఐ) ఈ సింపుల్ పద్ధతిని సూచించింది.

ఓ గ్లాసు నీళ్లు చాలు

ఓ గ్లాసులో సగం వరకు నీళ్లు పోయాలి. అందులో గుడ్డును వేయాలి. గుడ్డు నీటి అడుగుకు వెళ్లి అడ్డం తిరిగితే అది తాజాగా ఉన్నట్లు అర్థం. అదే అడుగున నిలువుగా ఉంటే గుడ్డు పాతదని అర్థం. అయితే వెంటనే దాన్ని పాడైందిగా భావించాల్సిన అవసరం లేదు. వాడే ముందు మరోసారి పరిశీలించాలి.

గుడ్డు నీటి పైకి తేలితే మాత్రం జాగ్రత్త. అది పాడై ఉండే అవకాశం ఉంది. అలాంటి గుడ్డును తినకుండా పడేయడం మంచిది.

పగలగొట్టాక కూడా చూడాలి

నీటి పరీక్షతో పాటు గుడ్డును పగలగొట్టిన తర్వాత కూడా కొన్ని విషయాలు గమనించాలి. గుడ్డులోంచి వింత వాసన వస్తే తినకూడదు. రంగులో మార్పు కనిపించినా వాడకూడదు. పెంకులో పగుళ్లు ఉన్నా, గుడ్డు నుంచి ద్రవం కారుతున్నా దాన్ని తీసుకోవద్దని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచిస్తోంది.

### ఫ్రిజ్‌లో ఎక్కడ పెట్టాలి?

గుడ్లను ఎక్కువకాలం తాజాగా ఉంచాలంటే వాటిని సరైన విధంగా భద్రపరచడం కూడా ముఖ్యం. తెచ్చిన ప్యాకింగ్‌లోనే గుడ్లను ఉంచడం మంచిది. ఇతర ఆహార పదార్థాల వాసనలు వాటికి పట్టకుండా ఇది ఉపయోగపడుతుంది. ఫ్రిజ్ తలుపులో కాకుండా షెల్ఫ్‌పై ఉంచడం మంచిది. తలుపు తరచూ తెరవడం వల్ల ఉష్ణోగ్రతలో మార్పులు వస్తాయి.

ఈ చిన్న జాగ్రత్తలు తప్పనిసరి

ఫ్రిజ్ ఉష్ణోగ్రత 4 డిగ్రీల సెల్సియస్ లేదా అంతకంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలి. గుడ్లను ఫ్రిజ్‌లో పెట్టే ముందు కడగకూడదు. అవసరమైతే వాడే ముందు మాత్రమే కడగాలి. అలాగే కొన్న గుడ్లను ముందుగా ఉపయోగిస్తే అవి ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూసుకోవచ్చు.

# పాలలో డిటర్జెంట్ కలిసిందా? ఇంట్లోనే ఇలా సులభంగా చెక్ చేసుకోండి



5-10 మిల్లీలీటర్ల పాలను గ్లాసులోకి తీసుకోవాలి

పాలను గట్టిగా షేక్ చేసి బుడగలను గమనించాలి

బుడగలు ఎక్కువసేపు ఉంటే కల్తీగా అనుమానించాలి

ఇంట్లో పరీక్ష తుది నిర్ధారణ కాదని గుర్తుంచుకోవాలి

ప్రతి ఇంట్లో నిత్యం ఉపయోగించే ఆహార పదార్థాల్లో పాలు ఒకటి. ఉదయం టీతో మొదలుకొని రాత్రి పడుకునే ముందు తాగే గ్లాసు వరకు పాలు ఉండాల్సిందే. అయితే పాల విషయంలో కల్తీ ఆందోళన కలిగిస్తోంది. పాలు పలుచగా కనిపించకుండా, నురుగు వచ్చేలా కనిపించేందుకు డిటర్జెంట్ వంటి పదార్థాలను కలుపుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. మరి మన ఇంట్లో వాడుతున్న పాలలోనూ డిటర్జెంట్ కలిసిందా? తెలుసుకోవడానికి ల్యాబ్ అవసరం లేదట. ఇంట్లోనే ఓ చిన్న పరీక్ష చేసుకోవచ్చని ఆహార భద్రతా అధికారులు చెబుతున్నారు. ఇంతకీ ఆ పరీక్ష ఏంటి? తెలుసుకుందాం..

ఓ చిన్న గ్లాసు చాలు

ముందుగా 5 నుంచి 10 మిల్లీలీటర్ల పాలను ఓ చిన్న గ్లాసులోకి తీసుకోండి. ఇప్పుడు దాన్ని గట్టిగా షేక్ చేయండి. ఆ తర్వాత పాలలో ఏం జరుగుతుందో కాసేపు గమనించండి. అంతే.. మీ ముందే ఓ సంకేతం కనిపిస్తుంది.

బుడగలు ఏం చెబుతున్నాయి?

షేక్ చేసిన వెంటనే బుడగలు ఏర్పడి త్వరగా మాయమైతే పాలలో డిటర్జెంట్ కల్తీ ఉన్నట్లు భావించాల్సిన అవసరం లేదని ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది. అదే బుడగలు ఎక్కువగా ఏర్పడి కొంతసేపు అలాగే ఉంటే మాత్రం అనుమానించాల్సి ఉంటుంది. డిటర్జెంట్ కల్తీకి ఇది ఓ సూచన కావచ్చని పేర్కొంది.

బుడగలు ఎందుకు వస్తాయి?

ఇక్కడే అసలు విషయం ఉంది. డిటర్జెంట్లలో ఉండే సర్ఫాక్టెంట్లు ద్రవం ఉపరితల ఉద్రిక్తతను తగ్గిస్తాయి. దీంతో పాలను షేక్ చేసినప్పుడు ఏర్పడిన గాలి చుట్టూ పలుచని పొర ఏర్పడుతుంది. ఫలితంగా బుడగలు వెంటనే పగిలిపోకుండా ఎక్కువసేపు నిలుస్తాయి. స్వచ్ఛమైన పాలలో మాత్రం ఈ బుడగలు అంతగా నిలవవు.

పాలు కొనే ముందు..

కల్తీకి దూరంగా ఉండాలంటే నమ్మకమైన బ్రాండ్లను ఎంచుకోవడం మంచిది. ప్యాకెట్ లేదా కార్టన్ కొనేటప్పుడు సీల్ సరిగా ఉందో చూడాలి. పదార్థాల వివరాలను పరిశీలించాలి. ప్యాకెట్‌పై ఉన్న ఎఫ్ఎస్-ఎస్ఏఐ లోగోతో పాటు 14 అంకెల లైసెన్స్ నంబర్‌ను కూడా చెక్ చేసుకోవాలి. అయితే ఇంట్లో చేసే ఈ పరీక్షను ప్రాథమిక సూచనగా మాత్రమే చూడాలి. పాలు కల్తీగా ఉన్నాయనే తుది నిర్ధారణకు అధికారిక పరీక్ష అవసరం. అయినప్పటికీ.. రోజూ తాగే పాల విషయంలో కాస్త అప్రమత్తంగా ఉండేందుకు ఈ చిన్న టెస్ట్ ఉపయోగపడుతుంది.

# కాంతులీనే చర్మం కోసం ఈ 5 ఫ్రూట్స్ ట్రై చేయండి!

చర్మం బిగుతుగా, యవ్వనంగా కనిపించడానికి కొల్లాజెన్ కీలకం

వయసు పెరిగే కొద్దీ శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తి సహజంగా తగ్గుతుంది

విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే పండ్లు కొల్లాజెన్ తయారీకి తోడ్పడతాయి

జామ, కివీ, నారింజ, స్ట్రాబెర్రీ, బొప్పాయి వంటి పండ్లు తీసుకోవడం మేలు

ఈ పండ్లలో కొల్లాజెన్ ఉండదు, కానీ దాని ఉత్పత్తికి శరీరానికి సాయపడతాయి



చర్మం ఆరోగ్యంగా, కాంతివంతంగా, యవ్వనంగా కనిపించడంలో కొల్లాజెన్ అనే ప్రోటీన్ కీలక పాత్ర పోషిస్తుంది. చర్మానికి బిగుతుదనాన్ని, నిర్మాణాన్ని ఇచ్చేది ఇదే. అయితే వయసు పెరిగే కొద్దీ మన శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తి సహజంగానే మందగిస్తుంది. ఈ ప్రక్రియను పూర్తిగా ఆపలేకపోయినా, సరైన పోషకాహారం ద్వారా కొల్లాజెన్ ఉత్పత్తికి శరీరం సిద్ధమయ్యేలా చేయవచ్చు. ముఖ్యంగా విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం చాలా అవసరం. టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం ప్రకారం, కొన్ని ప్రత్యేకమైన పండ్లను రోజూవారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా కొల్లాజెన్ ఉత్పత్తికి మద్దతు ఇవ్వవచ్చు. కేవలం ఒక పండుతో రాత్రికి రాత్రే అద్భుతాలు జరగవని, కానీ సమతుల్య ఆహారం, మంచి జీవనశైలితో పాటు వీటిని తీసుకుంటే మంచి ఫలితాలు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

కొల్లాజెన్ ఉత్పత్తికి తోడ్పడే 5 ముఖ్యమైన పండ్లు:

1. జామ : ఇందులో విటమిన్ సి అత్యధికంగా ఉంటుంది. కొల్లాజెన్ సంశ్లేషణకు విటమిన్ సి చాలా అవసరం. జామపండును నేరుగా తినొచ్చు లేదా ఫ్రూట్ సలాడ్స్‌లో కలిపి తీసుకోవచ్చు.

2. కివీ : విటమిన్ సికి కివీ పండు ఒక అద్భుతమైన వనరు. ఇది కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహించడమే కాకుండా, ఇందులోని యాంటీఆక్సిడెంట్లు చర్మ కణాలను ఫ్రీ రాడికల్స్ నష్టం నుంచి కాపాడతాయి.

3. నారింజ: విటమిన్ సి అనగానే అందరికీ గుర్తొచ్చేది నారింజ. దీన్ని నేరుగా తినడం లేదా రసం రూపంలో తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన విటమిన్ సి అందుతుంది.



4. స్ట్రాబెర్రీ : ఈ పండ్లలో విటమిన్ సి తో పాటు శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. స్మూతీలు, యోగర్ట్ లేదా ఓట్స్‌తో కలిపి వీటిని తీసుకోవచ్చు.

5. బొప్పాయి : విటమిన్ సి, ఇతర యాంటీఆక్సిడెంట్లు బొప్పాయిలో పుష్కలంగా ఉంటాయి. ఇవి కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచడంతో పాటు, చర్మాన్ని సంరక్షిస్తాయి.

ఒక ముఖ్య గమనిక: ఈ పండ్లలో నేరుగా కొల్లాజెన్ ఉండదు. కానీ, మన శరీరంలో కొల్లాజెన్‌ను తయారు చేసుకోవడానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. కాబట్టి, కేవలం ఈ పండ్లపైనే ఆధారపడకుండా, సరైన ప్రోటీన్లు ఉన్న సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం చర్మ సౌందర్యానికి అత్యంత ముఖ్యం.

# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు



ఢిల్లీ: కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. హౌరా- చెన్నై కారిడార్‌లో భాగంగా విశాఖ, విజయవాడ మీదుగా నాలుగు లేన్ల నిర్మాణానికి అంగీకారం తెలిపింది. ముంబై- చెన్నై కారిడార్‌లో భాగంగా గుంతకల్లు, రేణిగుంట మీదుగా నాలుగు లేన్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపింది. అదే విధంగా దేశంలో 7 హై డెన్సిటీ రైల్వే కారిడార్ల అభివృద్ధికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రయాణికుల రద్దీ తగ్గించేందుకు భారతీయ రైల్వేల భారీ ప్రణాళికలో భాగంగా ఢిల్లీ-హౌరా, ఢిల్లీ-ముంబై కారిడార్లకు ప్రాధాన్యం ప్రకటించింది. ఢిల్లీ-చెన్నై మార్గంలో విజయవాడ కీలక స్టేషన్‌గా అదేవిధంగా హౌరా-చెన్నై కారిడార్‌లో విశాఖపట్నం స్టేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొంది. ముంబై-చెన్నై మార్గంలో రేణిగుంట, గుంతకల్ అభివృద్ధి కి ఊతం ఇవ్వనున్నట్లు తెలిపింది. ఈ అంశమై రైల్వేశాఖ మంత్రి మాట్లాడుతూ పలు మార్గాల్లో నాలుగో లైన్ పనులు చేపట్టడంతో పాటు మరికొన్ని కారిడార్లు డీపీఆర్, ఆమోద దశలో ఉన్నాయని తెలిపారు. కేంద్ర నిర్ణయాలతో సరుకు రవాణా, ప్రయాణికుల సేవల సామర్థ్యం పెరగనుందని రైళ్ల సమయపాలన మెరుగుపడుతుందని కేంద్రమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

## సీజేపీ ఉద్యమకారుడికి నోటీసులా?
# సీజేఐ సూర్యకాంత్ తీవ్ర ఆగ్రహం



న్యూఢిల్లీ: కాక్రోచ్ జనతా పార్టీ నిరసనల్లో పాల్గొన్న ఒక విద్యార్థికి గ్రేటర్ నోయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసు జారీ చేయడంపై సుప్రీంకోర్టు బుధవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సిజెపి నిరసనలకు సంబంధించి విద్యార్థులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను కొట్టివేస్తూ, భవిష్యత్తులో వారిపై ఎటువంటి కఠిన చర్యలు తీసుకోకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ మేజిస్ట్రేట్ నోటీసు ఎలా ఇస్తారని కోర్టు ప్రశ్నించింది.. తీర్పు స్పష్టంగా ఉన్నప్పటికీ నోటీసు ఎలా ఇస్తారంటూ భారత ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గౌతమ్ బుద్ధ నగర్ జిల్లా మేజిస్ట్రేట్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌ల నుంచి ఈ ఘటనపై వివరణ కోరనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జూలైలో జరిగిన సీజేపీ నిరసనలకు సంబంధించి విద్యార్థులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి తామిచ్చిన ఆదేశాలు స్పష్టంగా ఉన్నప్పటికీ నోటీసు ఎలా జారీ చేస్తారు? మేజిస్ట్రేట్‌కు అంత ధైర్యమా?" అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. గౌతమ్ బుద్ధ యూనివర్సిటీ రెండో సంవత్సరం విద్యార్థి అక్షత్ త్రిపాఠికి సెప్టెంబర్ 4న గ్రేటర్ నోయిడా మేజిస్ట్రేట్ నోటీసు పంపారు. నిరసనల్లో పాల్గొనమని విద్యార్థులను ప్రోత్సహించినట్లు అందులో ఆరోపించారు. (ఈ నోటీసును మరుసటి రోజే ఉపసంహరించు కున్నట్లు కోర్టుకు తెలిపారు). ఇందుకు రూ. 5 లక్షల వ్యక్తిగత బాండ్‌ను అందించాలనికోరారు. అయితే ఆర్టికల్ 142 ప్రత్యేక అధికారాలను ఉపయోగించి, జూలై 20 - 25 మధ్య జబీూ నిరసనలకు సంబంధించి దేశవ్యాప్తంగా విద్యార్థులపై నమోదైన కేసులన్నింటినీ సుప్రీంకోర్టు రద్దు చేసింది. అలాగే కొత్తగా ఎలాంటి చర్యలు తీసుకోకూడదని కూడా స్పష్టం చేసింది. కాగా సీజేఐ సూర్యకాంత్ అనూహ్య వ్యాఖ్యల తరువాత పుట్టుకొచ్చిన సీజేపీ నీట్ ఆందోళన దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ముఖ్యంగా జెన్-జీ నుంచి ఈ పోరాటానికి లభించిన ఆదరణ, మద్దతు విశేషంగా నిలిచింది.

## అదేగనక జరిగితే లోకేశ్ జైలుకే: వరుదు కల్యాణి



తాడేపల్లి: వైఎస్సార్‌సీపీని తిట్టడమే టీడీపీ నేతల పనా? అని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మండిపడ్డారు. తాడేపల్లిలో ఆమె బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. తప్పుడు ఆరోపణలు చేయడం, పారిపోవడం టీడీపీ నేతలకే చెల్లిందని ఆమె విమర్శించారు. టీడీపీ నేతలు ఆధారాలు చూపించరని, దూషణలు మాత్రం చేస్తారని వరుదు కల్యాణి అన్నారు. డీఎస్సీలో అక్రమాలకు సమాధానాలు చెప్పకుండా పారిపోతున్నారని చెప్పారు. మెగా డీఎస్సీని దగా డీఎస్సీ చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యేలతో ప్రెస్‌మీట్ పెట్టించి పచ్చి అబద్ధాలు చెప్పించారని తెలిపారు. డీఎస్సీలో అక్రమాలు చేయకపోతే సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. నారా వారి పాలన నకిలీ సర్టిఫికెట్ల పాలన అని ఆమె అన్నారు.

### ఆ స్థాయిలో భారీ స్కాం..

"డీఎస్సీలో విచారణ జరిగితే లోకేశ్ జైలుకే. ఆ స్థాయిలో భారీ స్కాం జరిగింది. స్కాంపై కూటమి నేతలు నోరు మెదపటం లేదు. సవాల్ చేసిన నేతలంతా ఇప్పుడెందుకు పారిపోయారు. టైం, డేట్ చెప్తే మేము చర్చకు రావటానికి సిద్ధమే. స్పోర్ట్స్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిని కూడా చర్చకు తీసుకురావాలి. డీఎస్సీ పరీక్ష రాయకుండా ఉద్యోగాలు ఇవ్వటం స్కాం కాదా? రూ.3 లక్షలకు 120 ప్రశ్నలు అమ్ముకోవటం స్కాం కాదా? రూ.20 లక్షల చొప్పున ఉద్యోగం అమ్ముకోవడం స్కాం కాదా? టెట్ లేని ప్రభాకర్ గౌడ్ కు ఉద్యోగం ఇవ్వటం స్కాం కాదా? ఫేక్ జూడో సర్టిఫికేట్లు తెచ్చిన వారికి ఉద్యోగం ఇవ్వటం స్కాం కాదా? వీటన్నిటిపై విచారణ జరగాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద లేదా? సీబీఐ విచారణ జరిగితే లోకేశ్ జైలుకు వెళ్లక తప్పదు. ఆ భయంతోనే సీబిఐతో విచారణ జరపటం లేదన్నది వాస్తవం కాదా? లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడారు. ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు తెచ్చుకున్న వారి దగ్గర టీడీపీ నేతలు తమ పిల్లలకు చదువు చెప్పిస్తారా? లోకేశ్ చేసిన తప్పులను కవర్ చేయలేక మహిళా అధికారులు ఇబ్బందులు పడ్డారు. ఫేక్ ప్రచారం చేయటం ఎలాగో చంద్రబాబు, లోకేశ్ ట్రైనింగ్ ఇచ్చారు. అందుకే పార్టీ నేతలంతా బయటకు వచ్చి డీఎస్సీలో అక్రమాలు జరగలేదంటూ కబుర్లు చెప్పారు" అని వరుదు కల్యాణి అన్నారు.

## గవర్నర్ ఇవే అడిగారు: కేటీఆర్



హైదరాబాద్: రాష్ట్రంలో శాంతి భద్రతలపై గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. బుధవారం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన బీఆర్ఎస్ నేతలు.. అసెంబ్లీ ఘటనలో పోలీసుల తీరుపై ఫిర్యాదు చేశారు. అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎమర్జెన్సీని తలపించేలా పాలన కొనసాగుతుందన్నారు. "రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం. వెయ్యి రోజుల పాలన వైఫల్యాలు, యూరియా కొరత, రైతు బీమా, రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేసినందుకు గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యపై ఫిర్యాదు చేశామని కేటీఆర్ అన్నారు. రాహుల్ గాంధీ నల్ల టీ షర్ట్స్ వేసుకున్నట్టే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బ్లాక్ టీ షర్ట్స్ వేసుకున్నాము. బ్లాక్ టీ షర్ట్ తో అసెంబ్లీకి వెళ్తుంటే మమ్మల్ని పోలీసులు అడ్డుకున్నారు." అని కేటీఆర్ మండిపడ్డారు. "మాజీ హోం శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని మగ పోలీసులు గొంతు పట్టుకున్నారు. మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకొని లాగారు. దాడి చేసి మా పైనే ఉల్టా కేసులు పెడుతున్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ చావు కోరుకున్నారు. వేముల వీరేశం, కుంభం అనిల్‌రెడ్డి, నర్సారెడ్డి ఎర్రవల్లి ఫాం హౌస్ దగ్గరకు వచ్చారు. వేల మంది కాంగ్రెస్ గూండాలను ఎర్రవల్లి ఫాం హౌస్‌పై దాడి చేసేందుకు ఉసిగొల్పారు. మేము అనని మాటలను అన్నట్టు స్పీకర్‌కు ఆపాదించారు. దళిత స్పీకర్ అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలే స్పీకర్‌ను అవమానిస్తున్నారు. ..శాసన సభ కాదు.. దుశ్శాసన సభలా మార్చారు. చావు డప్పు ఎప్పుడు కొడతారో.. మనందరికీ తెలుసు. ఎర్రవల్లి ఫాం హౌస్ దగ్గర చావు డప్పు కొట్టారు. అసెంబ్లీ బయట జరిగిన ఘటనపై సీఎస్ డీజీపీని పిలిపించి మాట్లాడుతానని గవర్నర్ హామీ ఇచ్చారు. ఇలాంటి ఘటనలు మంచివి కాదని గవర్నర్ మాతో చెప్పారు." అని కేటీఆర్ వివరించారు.

# 9/11 వేళ.. గాల్లోకి లేచిన ఒకేఒక్క విమానం!




సెప్టెంబర్ 11, 2001.. అమెరికా చరిత్రలోనే అత్యంత విషాదకరమైన రోజు. విమానాలను హైజాక్ చేసి అమెరికాపై భీకర దాడులకు పాల్పడింది ఉగ్రసంస్థ అల్‌ఖైదా. అయితే ఆ దాడుల వేళ దేశవ్యాప్తంగా పౌర విమాన రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. ఆకాశం దాదాపు నిర్మానుష్యంగా మారింది. కానీ.. ఆ భయానక పరిస్థితుల్లోనూ ఓ విమానానికి ప్రత్యేక అనుమతితో గాల్లోకి ఎగిరింది.

సెప్టెంబర్ 9/11 దాడుల తర్వాత.. అనంతరం అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఫీూూ) దేశవ్యాప్తంగా పౌర విమానాలను నేలకే పరిమితం చేసింది. అమెరికా చరిత్రలో ఇలాంటి దేశవ్యాప్త పౌర విమానాల నిలిపివేత ఇదే తొలిసారి. అయితే ఆనాడు అత్యవసర పరిస్థితుల దృష్ట్యా.. సైనిక, అత్యవసర వైద్య విమానాలే తిరిగాయి. ఈ క్రమంలో.. ఎఫ్ఏఏకు ఓ ఎమర్జెన్సీ కాల్ వచ్చింది. ఫ్లోరిడాకు చెందిన స్నేక్ ఎక్స్‌పర్ట్ లారెన్స్ వాన్ సెర్టిమా.. ఒక ఇన్‌లాండ్ టైపాన్ పామును తిరిగి దాని బోనులో పెట్టే ప్రయత్నం చేయగా అది ఆయన బొటనవేలిని కాటేసింది. ఆస్ట్రేలియాకు చెందిన ఇన్‌లాండ్ టైపాన్ అనేది అత్యంత విషపూరితమైన పాముల్లో ఒకటి. కాటు తర్వాత ఆయన పరిస్థితి వేగంగా విషమించింది. స్పృహ కోల్పోవడంతోపాటు కళ్ల నుంచి, చెవుల నుంచి, నోటి నుంచి రక్తస్రావం మొదలైంది. మయామిలోని వైద్యులు అందుబాటులో ఉన్న యాంటీవెనమ్‌తో చికిత్స ప్రారంభించారు. అయితే అది సరిపోలేదు. ఇన్‌లాండ్ టైపాన్ విషానికి ప్రత్యేకంగా ఉపయోగించే యాంటీవెనమ్ అవసరమైంది. ఆ మందు అప్పట్లో న్యూయార్క్, శాన్‌డియాగోలోని జంతుప్రదర్శనశాలల్లో మాత్రమే లభ్యమవుతోంది. 9/11 దాడులతో న్యూయార్క్ పూర్తిగా కల్లోలంలో ఉండటంతో.. వైద్య బృందం దృష్టి శాన్‌డియాగోపై పడింది. వాన్ సెర్టిమా పరిస్థితి మరింత విషమించడంతో వైద్య, అగ్నిమాపక అధికారులు విమాన ప్రయాణానికి ప్రత్యేక అనుమతి కోరారు. గంటలపాటు చర్చల అనంతరం ఫీూూ అనుమతించింది. 2001 సెప్టెంబర్ 12న శాన్‌డియాగో నుంచి ఒక చిన్న లియర్‌జెట్ బయలుదేరింది. విమానం అమెరికా మీదుగా ప్రయాణిస్తుండగా రెండు ఫైటర్ జెట్లు దానికి ఎస్కార్ట్‌గా వెళ్లాయి. శాన్‌డియాగో నుంచి తెచ్చిన అదనపు యాంటీవెనమ్ మయామికి చేరిన తర్వాత వైద్యులు వెంటనే వాన్ సెర్టిమాకు అందించారు. చికిత్సకు స్పందించిన ఆయన చివరకు ప్రాణాలతో బయటపడ్డారు. రెండు రోజుల తర్వాత టీవీ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. పాముదేం తప్పు లేదు..తన నిర్లక్ష్యమే కారణమంటూ ఓ స్టేట్‌మెంట్ ఇచ్చారాయన.

### అమెరికా చరిత్రలో చీకటి రోజు

సెప్టెంబర్ 9, 2001.. 19 మంది ఆల్‌ఖైదా ఉగ్రవాదులు నాలుగు వాణిజ్య విమానాలను హైజాక్ చేశారు. రెండు విమానాలను న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ ట్విన్ టవర్స్‌ను ఢీకొట్టించారు. మూడో విమానాన్ని వాషింగ్టన్ సమీపంలోని పెంటగాన్‌పైకి దించారు. నాలుగో విమానం ఫ్లైట్ 93ను ప్రయాణికులు తిరగబడటంతో పెన్సిల్వేనియాలోని ఖాళీ ప్రదేశంలో కూల్చివేశారు. ఉదయం 8.46 గంటలకు అమెరికన్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ 11 ఉత్తర టవర్‌ను ఢీకొట్టింది. 9.03 గంటలకు యునైటెడ్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ 175 దక్షిణ టవర్‌ను ఢీకొట్టింది. 9.37 గంటలకు అమెరికన్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ 77 పెంటగాన్‌ను ఢీకొట్టింది. 10.03 గంటలకు ఫ్లైట్ 93 పెన్సిల్వేనియాలో కూలిపోయింది. కొద్దిసేపటికే ట్విన్ టవర్స్ రెండూ కుప్పకూలాయి.

### దాదాపు 3 వేల మంది బలి..

9/11 దాడుల్లో 2,977 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో న్యూయార్క్‌లో 2,753 మంది, పెంటగాన్‌లో 184 మంది, ఫ్లైట్ 93లో 40 మంది ఉన్నారు. 90కుపైగా దేశాలకు చెందిన ప్రజలు బాధితుల్లో ఉన్నారు. ఈ దాడులకు బాధ్యులు ఆల్‌ఖైదాకు చెందిన 19 మంది హైజాకర్లు. వారంతా ఆల్‌ఖైదా శిక్షణ పొందినవారేనని ఎఫ్‌బీఐ దర్యాప్తులో తేలింది. ఈ దాడుల వెనుక ఆల్‌ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్ ఉన్నట్లు దర్యాప్తు నిర్ధారించింది. బిన్ లాడెన్ 2011 మే 2న పాకిస్థాన్‌లోని అబ్బొట్టాబాద్‌లో అమెరికా ప్రత్యేక దళాల ఆపరేషన్‌లో హతమయ్యాడు.

# నీటి కొరతతో సౌదీ అరేబియా ఏం చేసిందో తెలుసా?



ఎటు చూసినా ఎడారి.. మండే ఎండలు.. ఏడాదికి 100 మిల్లీమీటర్ల కంటే తక్కువ వర్షపాతం.. శాశ్వత నదులు కూడా లేవు. అయినా సౌదీ అరేబియాలో 3.7 కోట్లకుపైగా జనాభా రోజువారీ అవసరాలకు నీటిని పొందుతోంది. మరి చుక్క నీటి కోసం కూడా ప్రకృతిపై ఆధారపడలేని ఈ దేశం.. కోట్లాది మందికి నీటిని ఎలా అందిస్తోంది? ఎడారి మధ్యలో ఇంత భారీ జలవ్యవస్థను ఎలా నిర్మించింది? సౌదీ అరేబియాలోని తీర ప్రాంతాల్లో భారీ డీశాలినేషన్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. సముద్రం నుంచి నీటిని తీసుకొచ్చి, అందులోని ఉప్పు, మలినాలను తొలగించి మంచినీటిగా మారుస్తారు. అనంతరం ఈ నీటిని భారీ పైప్‌లైన్ల ద్వారా వందల కిలోమీటర్ల దూరంలోని నగరాలు, జనావాసాలకు తరలిస్తారు. అంటే.. సహజంగా ప్రవహించే నదులు లేకపోయినా, విస్తారమైన ప్రాంతాలకు నీటిని చేరవేసే ఓ 'కృత్రిమ నదీ వ్యవస్థ'ను నిర్మించుకున్నట్టే. మరి సముద్రపు ఉప్పునీరు అసలు తాగునీటిగా ఎలా మారుతుంది? ఎడారి, కొండలు, రాళ్లను దాటుకుంటూ ఈ నీరు వందల కిలోమీటర్లు ఎలా ప్రయాణిస్తుంది? ఇందుకోసం సౌదీ నిర్మించిన భారీ పైప్‌లైన్లు, అత్యాధునిక శుద్ధి వ్యవస్థ ఎలా పనిచేస్తాయన్నది ఆసక్తికరం.

### భారీ పైప్‌లైన్ల నిర్మాణం

ఈ నీటి రవాణాకు ఉపయోగించే పైప్‌లైన్లు సాధారణమైనవి కావు. ఎడారి వేడి, ఇసుక తుపాన్లు, నేలలోని ఒత్తిడిని తట్టుకునేలా హై-స్ట్రెంగ్త్ కార్బన్ స్టీల్‌తో వీటిని తయారు చేస్తారు. దాదాపు 1.8 మీటర్ల వ్యాసంతో ఉండే భారీ పైపులను 12 నుంచి 18 మీటర్ల పొడవైన సెక్షన్లుగా తయారు చేసి, ప్రత్యేక ట్రక్కుల్లో ఎడారి ప్రాంతాలకు తరలిస్తారు. పైపులకు తుప్పు పట్టకుండా ప్రత్యేక కోటింగ్ వేసి, అల్ట్రాసోనిక్ పరీక్షలు నిర్వహించిన తర్వాతే వినియోగిస్తారు.

### ఇసుక.. రాళ్లు.. కొండలు దాటుతూ

తీర ప్రాంతం నుంచి అంతర్భాగాలకు పైప్‌లైన్ వేయడం మరో భారీ సవాలు. ముందుగా ఞూ, ఆధునిక సర్వే పరికరాలతో మార్గాన్ని నిర్ణయిస్తారు. కదిలే ఇసుక దిబ్బలు, అస్థిరమైన భూభాగాలను వీలైనంత వరకు తప్పించుకుంటారు. రాళ్లు, కొండలు ఎదురైతే నియంత్రిత పేలుళ్లతో వాటిని తొలగించి లోతైన కాలువలు తవ్వుతారు. అందులో పైపులను అమర్చి.. ఒక్కో సెక్షన్‌ను మరొకదానితో అనుసంధానిస్తూ వేల కిలోమీటర్ల నెట్‌వర్క్‌ను నిర్మించారు.

### అసలు నీరు ఎక్కడి నుంచి?

ఇదంతా ఒక ఎత్తయితే.. అసలు నీటి వనరు సముద్రమే. తీరానికి వందల మీటర్ల దూరంలో భారీ ఇన్‌టేక్ పైపులను ఏర్పాటు చేసి సముద్రపు నీటిని ప్లాంట్లలోకి తీసుకొస్తారు. కొన్ని పైపులు రోజుకు కోట్ల లీటర్ల నీటిని తరలించే సామర్థ్యం కలిగి ఉంటాయి. చేపలు, పీతలు, జెల్లీ ఫిష్ వంటి సముద్ర జీవులు లోపలికి రాకుండా ప్రత్యేక స్క్రీన్లను ఏర్పాటు చేస్తారు.

### ఉప్పునీరు.. మంచినీరుగా ఎలా?

మొదట సముద్రపు నీటిని ఇసుక ఫిల్టర్ల ద్వారా శుద్ధి చేస్తారు. ఫెరిక్ క్లోరైడ్, సోడియం హైపోక్లోరైట్ వంటి రసాయనాలతో మలినాలను ఒకచోట చేర్చి తొలగిస్తారు. ఆ తర్వాత 1--5 మైక్రాన్ల పరిమాణంలో ఉన్న సూక్ష్మ కణాలను కూడా పట్టుకునే కార్ట్రిడ్జ్ ఫిల్టర్ల ద్వారా నీటిని పంపిస్తారు. అసలు కీలక ప్రక్రియ రివర్స్ ఆస్మోసిస్ . దాదాపు 60 బార్ ఒత్తిడితో సముద్రపు నీటిని ప్రత్యేక మెంబ్రేన్‌ల గుండా పంపుతారు. నీటి అణువులు మాత్రమే మెంబ్రేన్‌ను దాటుతుండగా.. ఉప్పు, ఇతర మలినాలు వెనుకే మిగిలిపోతాయి. అవసరమైతే మరోసారి ఞా ప్రక్రియ నిర్వహించి మరింత శుద్ధి చేస్తారు.

### శుద్ధి చేశాక మళ్లీ ఖనిజాలే!

అయితే పూర్తిగా శుద్ధి చేసిన నీటిలో సహజంగా ఉండే కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు చాలా తక్కువగా ఉంటాయి. దీంతో నీటికి అవసరమైన ఖనిజాలను మళ్లీ కలుపుతారు. పీహెచ్ స్థాయిని కూడా సరిచేసి.. తాగేందుకు అనువుగా మారుస్తారు.

### ఖర్చు భారీ.. అవసరం తప్పనిసరి

ఇంత భారీ నీటి వ్యవస్థను నిర్మించడం అంత చౌక కాదు. ఒక్క కిలోమీటర్ పైప్‌లైన్ నిర్మాణానికే మిలియన్ల డాలర్లు ఖర్చవుతాయి. భారీ డీశాలినేషన్ ప్లాంట్లకు వందల మిలియన్ల డాలర్ల పెట్టుబడులు అవసరం. నీటి ఉత్పత్తి ఖర్చు కూడా సాంకేతికత, విద్యుత్ ధరలు, ప్లాంట్ సామర్థ్యాన్ని బట్టి గణనీయంగా ఉంటుంది. అయినా సౌదీకి మరో మార్గం పెద్దగా లేదు. నదులు లేని దేశం.. తక్కువ వర్షపాతం.. విస్తారమైన ఎడారి. అందుకే సముద్రాన్నే నీటి వనరుగా మార్చుకుని.. వందల కిలోమీటర్ల పైప్‌లైన్లతో ఆ నీటిని ఎడారి మధ్యనున్న నగరాలకు చేరుస్తోంది. సహజంగా లేని నదులకు బదులుగా ఇంజినీరింగ్‌తో కృత్రిమ జలధారను సృష్టించుకుంది.

# ట్రంప్ వార్నింగ్.. ఇరాన్‌కు కటీఫ్ చెప్పాల్సిందేనా?

ఇరాన్‌పై అమెరికా ఆంక్షల ఉచ్చు మరింత బిగుస్తోంది. ఇరాన్‌తో ఆర్థిక సంబంధాలు కొనసాగించే దేశాలు వెంటనే వాటిని తగ్గించుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ట్రంప్ ప్రభుత్వం హెచ్చరిస్తోంది. ఇరాన్‌ను ఆర్థికంగా ఒంటరిని చేసి.. చివరకు అమెరికాతో చర్చలు, ఒప్పందానికి దిగేలా ఒత్తిడి చేయడమే వాషింగ్టన్ వ్యూహంగా కనిపిస్తోంది. అయితే ఈ హెచ్చరికలకు ఇరాన్ ప్రధాన భాగస్వాములైన చైనా, రష్యా ఎంతవరకు తలొగ్గుతాయన్నది ఇప్పుడు కీలకంగా మారింది. అదే సమయంలో ఈ పరిణామం భారత్‌కు మాత్రం కొత్త చిక్కును తెచ్చిపెట్టింది. ఒకవైపు అమెరికాతో వేగంగా బలపడుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యం.. మరోవైపు ఇరాన్‌తో భారత్‌కు ఉన్న చారిత్రక, వాణిజ్య, వ్యూహాత్మక బంధం. ఈ రెండింటినీ సమతుల్యం చేయడం ఢిల్లీకి సవాల్‌గా మారింది. ముఖ్యంగా ఇరాన్‌తో ఆర్థిక సంబంధాలు కొనసాగించే దేశాలపై సెకండరీ ఆంక్షలు విధించే అవకాశం ఉందన్న హెచ్చరిక నేపథ్యంలో.. భారత్ ఎంతవరకు అమెరికా ఒత్తిడిని పరిగణనలోకి తీసుకుంటుందన్నదే ఆసక్తికరంగా మారింది. అయితే ఇది భారత్‌కు పూర్తిగా కొత్త పరిస్థితి కాదు.

### రష్యా విషయంలో వెనక్కి తగ్గని ఢిల్లీ

ఉక్రెయిన్ సంక్షోభం తర్వాత రష్యాపై అమెరికా, పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించినప్పటికీ.. భారత్ మాస్కోతో సంబంధాలను పూర్తిగా తెంచుకోలేదు. ముఖ్యంగా దేశీయ ఇంధన అవసరాలను దృష్టిలో పెట్టుకుని రష్యా నుంచి భారీగా క్రూడ్ కొనుగోళ్లను కొనసాగించింది. 2026 జూన్‌లో రష్యా చమురు భారత్ మొత్తం క్రూడ్ దిగుమతుల్లో సగానికి పైగా వాటా సాధించినట్లు రాయిటర్స్ డేటా పేర్కొంది. అంటే అమెరికా ఒత్తిడి ఉన్నప్పటికీ జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని భారత్ కొనసాగించింది. అయితే ఇరాన్ విషయంలో సమీకరణాలు కొంత భిన్నంగా ఉన్నాయి.

### ఇప్పటికే భారీగా తగ్గిన వాణిజ్యం

భారత్--ఇరాన్ ద్వైపాక్షిక వాణిజ్యం గతంతో పోలిస్తే భారీగా క్షీణించింది. 2018--19లో దాదాపు 17 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్యం.. 2025--26లో సుమారు 1.6 బిలియన్ డాలర్లకు పడిపోయింది. భారత్ ప్రధానంగా ఇరాన్‌కు బియ్యం, టీ, ఔషధాలు తదితర వస్తువులను ఎగుమతి చేస్తోంది. అమెరికా ఆంక్షలు మరింత కఠినతరం కావడం, యూఏఈ వంటి మార్గాల ద్వారా చెల్లింపులు, రీ-ఎగుమతులపై ఆంక్షల ప్రభావం పెరగడం భారత ఎగుమతిదారులకు ఇబ్బందులు కలిగించే అవకాశం ఉంది. ముఖ్యంగా బాస్మతి, టీ, ఫార్మా రంగాలపై ప్రభావం పడొచ్చు. అయితే ఇరాన్‌తో వాణిజ్యం ఇప్పటికే పరిమిత స్థాయికి చేరినందున.. భారత్ మొత్తంగా ఎదుర్కొనే ఆర్థిక దెబ్బ కంటే, కొన్ని రంగాల్లోని ఎగుమతిదారులపై ప్రభావమే ఎక్కువగా ఉండొచ్చు.




### చమురు కంటే పెద్ద ముప్పు.. హర్మూజ్

భారత్‌కు ఇరాన్ విషయంలో అసలు ఆందోళన కేవలం ఆ దేశం నుంచి ఎంత చమురు కొనుగోలు చేస్తున్నామన్నది కాదు.. హర్మూజ్ జలసంధి. ప్రపంచ ఇంధన సరఫరాకు అత్యంత కీలకమైన ఈ మార్గంలో ఉద్రిక్తత పెరిగితే అంతర్జాతీయ చమురు ధరలు ఒక్కసారిగా ఎగిసే అవకాశం ఉంది. చమురు దిగుమతులపై అధికంగా ఆధారపడే భారత్‌లో దీనివల్ల దిగుమతి బిల్లు పెరగడంతో పాటు రూపాయి, ద్రవ్యోల్బణంపై ఒత్తిడి పెరగొచ్చు. అయితే తాజా అమెరికా ఆంక్షల ప్రకటన తర్వాత వెంటనే చమురు ధరలు పెరగలేదు. ఆంక్షలు ఇరాన్‌పై ఒత్తిడిని పెంచి, చివరకు దౌత్యపరమైన పరిష్కారానికి దారితీయవచ్చన్న అంచనాలు కూడా మార్కెట్లలో కనిపించాయి. సోమవారం బ్రెంట్ క్రూడ్ ధర 2.35 శాతం తగ్గి 92.17 డాలర్ల వద్ద ముగిసింది.

### చాబహార్‌ను వదులుకోవడం అంత సులభమా?

ఇరాన్‌తో భారత్ సంబంధాల్లో చాబహార్ పోర్టు మరో కీలక అంశం. పాకిస్థాన్‌ను దాటకుండా అఫ్గానిస్థాన్, మధ్య ఆసియాకు చేరుకునే మార్గంగా ఇది భారత్‌కు వ్యూహాత్మక ప్రాధాన్యం కలిగి ఉంది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో చాబహార్‌లో భారత కార్యకలాపాలు కొనసాగించడం సవాల్‌గా మారుతున్నప్పటికీ.. ఇరాన్‌తో పూర్తిగా సంబంధాలు తెంచుకుంటే ఈ కీలక కనెక్టివిటీ మార్గంపై భారత్ తన ప్రభావాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. అందుకే ఇరాన్ భారత్‌కు కేవలం వాణిజ్య భాగస్వామి మాత్రమే కాదు.. పశ్చిమాసియాలో వ్యూహాత్మక భాగస్వామి కూడా.

### మరి మోదీ సర్కార్ ఏం చేస్తుంది?

ప్రస్తుతానికి భారత్‌పై అమెరికా నేరుగా ఆంక్షలు విధించలేదు. తాజా చర్యల్లో భారత్‌ను లక్ష్యంగా చేసుకున్న నిర్ణయం కూడా కనిపించలేదు. దీంతో ఢిల్లీకి ఇంకా కొంత దౌత్యపరమైన వెసులుబాటు ఉంది. అమెరికాతో సంబంధాలను దెబ్బతీయకుండా.. అదే సమయంలో ఇరాన్‌తో అవసరమైన వ్యూహాత్మక ప్రయోజనాలను కాపాడుకోవడం భారత్ ముందున్న వాస్తవిక మార్గంగా కనిపిస్తోంది. రష్యా విషయంలో అనుసరించినట్టుగా జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తూనే, ఆంక్షల పరిధిలోకి వెళ్లకుండా సంబంధాలను పరిమిత స్థాయిలో కొనసాగించే ప్రయత్నం చేయొచ్చు.

### కటీఫ్ కాదు.. కత్తిమీద సాము!

కాబట్టి ప్రస్తుత పరిస్థితుల్లో "ఇరాన్‌కు భారత్ కటీఫ్ చెబుతుంది" అనుకోవడం తొందరపాటు అంచనా. అదే సమయంలో అమెరికా హెచ్చరికలను పూర్తిగా విస్మరించి ఇరాన్‌తో యథావిధిగా ఆర్థిక సంబంధాలు కొనసాగించడం కూడా ఢిల్లీకి అంత సులభం కాదు. వాణిజ్యం ఇప్పటికే గణనీయంగా తగ్గిపోయింది. చమురు విషయంలో భారత్‌కు ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలున్నాయి. కానీ చాబహార్, మధ్య ఆసియా కనెక్టివిటీ, పశ్చిమాసియాలో వ్యూహాత్మక ప్రయోజనాలు, హర్మూజ్ భద్రత వంటి అంశాలను ఒక్కసారిగా పక్కన పెట్టడం సాధ్యం కాదు. అందుకే భారత్ ముందున్న మార్గం 'ఇరాన్‌కు కటీఫ్' కంటే.. 'అమెరికా ఆంక్షలకు చిక్కకుండా ఇరాన్‌తో అవసరమైన సంబంధాలను కొనసాగించడం' అయ్యే అవకాశమే ఎక్కువ. రష్యా విషయంలో అమెరికా ఒత్తిడిని తట్టుకుని జాతీయ ప్రయోజనాలను కాపాడుకున్న భారత్.. ఇప్పుడు ఇరాన్ విషయంలోనూ అదే వ్యూహాన్ని అనుసరిస్తుందా? లేక అమెరికాతో పెరుగుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యానికి మరింత ప్రాధాన్యం ఇస్తుందా? ఈ సమతుల్యమే మోదీ సర్కార్‌కు అసలు పరీక్ష.

## తల్లి ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డ ఆరోగ్యంగా ఉంటాడు

## గూడూరు సీ హెచ్ సీలో అన్నదానం




గూడూరు శ్రీ వార్త న్యూస్ తల్లి ఆరోగ్యంగా ఉంటేనే జన్మించే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయ కుమార్ అన్నారు.స్థానిక గూడూరు ప్రభుత్వ




కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో ప్రతి నెల 9వ తేదీన నిర్వహించే ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ పథకంలో భాగంగా శ్రీ సత్యసాయి సేవా సమితి మచిలీపట్నం ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు నారాయణ సేవ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు సమయానికి ఆహారం తీసుకోవాలని, వైద్య పరీక్షలు చేయించుకోవాలని, వేసవి, వర్షాకాలంలో మంచినీరు, కొబ్బరినీరు, బార్లీ వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. పండంటి బిడ్డకు జన్మనివ్వాలని ఆకాంక్షించారు.మహిళా వైద్యురాలు డాక్టర్ అరుణ కాత్యాయని గర్భిణీలకు సూచనలు చేశారు. ప్రతి నెల సామూహిక సీమంత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, 5, 7, 9 నెలల గర్భిణీలను గుర్తించి కార్యక్రమంలో పాల్గొనేలా చేయాలని ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ హరి రంగ ప్రసాద్, స్టాఫ్ నర్స్ విక్టోరియా, సంస్థ ప్రతినిధులు పి.వరప్రసాద్, వై.రాజమోహన్, కొట్టే నాగమణి, ఎం.భవాని, ఎస్.నాగమణి, వెంకటలక్ష్మి, పోతుకూచి నాగమణి, సింధు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త బైక్ ఇచ్చి, నష్టపరిహారం చెల్లించాలి.

## కృష్ణా జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పు.




మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ :తయారీలో లోపం ఉన్న "టీవీఎస్ జూపిటర్ 125" వాహనాన్ని తీసుకొని వినియోగదారురాలికి కొత్త వాహనం తిరిగి ఇవ్వాలని లేదా బైకు ఖరీదు 1,15,500రూపాయలు 9% వడ్డీతో తిరిగి చెల్లించాలని, మానసిక ఒత్తిడి కలగజేసినందుకు 25 వేల రూపాయలు లీగల్ ఖర్చులు కింద పదివేల రూపాయలు చెల్లించాలని మచిలీపట్నం టీవీఎస్ డీలర్,విజయవాడ టీవీఎస్ డీలర్, కాసా మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారిని ఆదేశిస్తూ కృష్ణాజిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు సిహెచ్. కిషోర్ కుమార్ సభ్యురాలు రాయల శ్రీలక్ష్మి బుధవారం తీర్పు చెప్పారు.. 30 రోజులలోపు తీర్పు అమలు చేయాలని కమిషన్ ఆదేశించింది. విజయం సాధించిన వినియోగదారురాలు తరపున న్యాయవాది లంకిశెట్టి బాలాజీ ఫిర్యాదు వివరాలను వివరించారు.కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్ గా పనిచేస్తున్న లక్ష్మణ్ కుమార్ భార్య బొమ్మిశెట్టి వెంకట నాగ దీప్తి మచిలీపట్నంలో లెక్చరర్ గా పనిచేస్తున్నారు . 2024 జులై ఒకటో తారీఖున నాగ దీప్తి మచిలీపట్నం జిల్లా పరిషత్ ఎదురుగా గల టీవీఎస్ డీలర్ కసా మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ వద్ద 1,15,500 చెల్లించి టీవీఎస్ జూపిటర్ 125 కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన తేదీ నుండి వాహనంలో తయారీలోపం వలన పలు ఇబ్బందులకు గురిచేసింది. ఏడుసార్లు సర్వీసింగ్ చేయించిన సర్వీసు డబ్బులు తీసుకున్నారు గాని బండిలోని లోపాన్ని సరిచేలేకపోయారు. వినియోగదారురాలు దీప్తి ఆమె భర్త లక్ష్మణ కుమార్ అనేక పర్యాయములు మచిలీపట్నం మరియు విజయవాడలోని కాసా మోటార్స్ వారిని సంప్రదించిన ఫలితం లేకపోయింది.విసిగివేసారిన వినియోగదారులు న్యాయం కోసం కృష్ణా జిల్లా వినియోగదారుల కమిషన్ లో 2025 జూన్ 30వ తారీఖున ఫిర్యాదు దాఖలు చేసింది. వినియోగదారుల కమిషన్ ఇరుపక్షాల వాద ప్రతివాదంలో విన్న పిదప, వాహనాన్ని శిక్షణ పొందిన మెకానిక్ తో పరీక్ష చేయించి వాహనం తయారీలో లోపం ఉన్న విషయాన్ని నిర్ధారించారు. టీవీఎస్ వాహనంలో తయారీలో ఉందని వినియోగదారులకు ఇబ్బంది కలగజేసినట్లుగా నిర్ధారిస్తూ కమిషన్ బుధవారం తీర్పు చెప్పింది. తీర్పు ప్రకారం 30 రోజుల్లోపు కొత్త వాహనం గాని లేదా వాహన ఖరీదును 9 శాతం వడ్డీతో తిరిగి చెల్లించాలని 25 వేల రూపాయలు మానసిక ఒత్తిడికి గురి చేసినందుకు పదివేల రూపాయలు కోర్టు ఖర్చులు కింద చెల్లించాలని తీర్పు చెప్పారు.వినియోగదారురాలు తరుపున లంకిశెట్టి బాలాజీ, లంకి శెట్టి సాయి ఫణి సంతోష్, చిన్నంశెట్టి ఆశా నాగ మౌనిక,మద్దాల సువర్ణ రాజు న్యాయవాదులుగా వ్యవహరించారు.

## 2023 సెప్టెంబర్ 9 చీకటి రోజు..

## జగన్ అహంకారంతోనే చంద్రబాబు

## అక్రమ అరెస్ట్..... పీవీ ఫణికుమార్, నిమ్మగడ్డ శ్రీధర్



మచిలీపట్నం,శ్రీవార్త న్యూస్:జగన్మోహన్ రెడ్డికి అహంకారం నెత్తికెక్కి ముఖ్యమంత్రిగా కళ్లు మూసుకుపోయి చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేయించారని, 2023 సెప్టెంబర్ 9ను తలచుకుంటేనే బాధ వేస్తుందని, అది ఒక చీకటి రోజు అని బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పి.వి.ఫణి కుమార్, మచిలీపట్నం రామలింగేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ నిమ్మగడ్డ శ్రీధర్ అన్నారు.మచిలీపట్నంలో బుధవారం పి.వి.ఫణి కుమార్ కార్యాలయంలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును గుర్తుచేసుకుంటూ కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.నిరుద్యోగులకు స్కిల్ డెవలప్మెంట్ లో శిక్షణ ఇచ్చేందుకు 241 కోట్ల రూపాయలు ఖర్చు చేయడమే చంద్రబాబు చేసిన తప్పుగా జగన్ చూపించారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 43 స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ద్వారా 2.30 లక్షల మంది యువతకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చారన్నారు. సిమెన్స్ కంపెనీ పర్యవేక్షణలో డిజైన్ టెక్ కంపెనీ ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించిందన్నారు.2019లో వైసీపీ అధికారంలోకి రాగానే ఆ సెంటర్లన్నింటినీ క్లోజ్ చేశారని, చివరకు కేసు పెట్టి 37వ ముద్దాయిగా చేర్చి చంద్రబాబును అరెస్టు చేసి జైలుకు పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుడు ప్రపంచవ్యాప్తంగా చంద్రబాబు అక్రమ అరెస్టుకు పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయని, ఆ రోజును తెలుగు ప్రజలు ఎవరూ మరిచిపోలేరన్నారు.చంద్రబాబు అద్భుతంగా తీర్చిదిద్దిన స్కిల్ సెంటర్లలో శిక్షణకు అవసరమైన పరికరాలన్నీ ఉన్నాయని, కానీ వైసీపీ ప్రభుత్వం వాటిని మూసేయడం వల్ల ఎంతోమంది యువత నష్టపోయారన్నారు.ఒక ముఖ్యమంత్రి కుమారుడిగా ఉండి 43 వేల కోట్ల అక్రమార్జన కేసులో 16 నెలలు జైలు జీవితం గడిపిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని, తాను జైలుకు వెళ్లాను కాబట్టి చంద్రబాబును కూడా పంపాలనే పంతంతో అక్రమ కేసుతో జైలుకు పంపారని ధ్వజమెత్తారు.ఇవన్నీ చూసిన ప్రజలు వైసీపీకి గుణపాఠం చెప్పారని, అహంకారం పనికిరాదని, దుర్మార్గాలు చూస్తూ ఊరుకోమని 11 సీట్లకే పరిమితం చేశారని, రాజకీయాల్లో అతిగా పోతే పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పేందుకు వైసీపీ పరిస్థితే నిదర్శనమని అన్నారు.

# సాగరతీరాన భక్తి వైభవం.. 63 అడుగుల విజయ గణపతి!

11 రోజుల పాటు ఆధ్యాత్మిక వేడుకలు..

630 కిలోల బందరు లడ్డు ప్రత్యేక ఆకర్షణ

మహాగణపతిని దర్శించుకునేందుకు 10 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం.....మంత్రి కొల్లు రవీంద్ర.




మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ మంగినపూడి సాగరతీరంలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న 63 అడుగుల మట్టి విజయ గణపతి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించి విజయవంతం చేయాలని రాష్ట్ర గనులు, భూగర్భ మైనింగ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. స్థానిక వేడుక ఫంక్షన్ హాల్లో బుధవారం ఉత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.




రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సమావేశంలో ఉత్సవ ఏర్పాట్లు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రతా చర్యలు తదితర అంశాలపై చర్చించారు.మంగినపూడి సముద్రతీరంలో వినాయక చవితి సందర్భంగా మట్టితో అపురూపంగా రూపొందిస్తున్న 63 అడుగుల విజయ గణపతిని ఈ నెల 14 నుంచి 11 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో కొలువుదీర్చనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ 11 రోజుల్లో దాదాపు పది లక్షల మంది భక్తులు విజయ గణపతితో పాటు సమీపంలోని ఉప ఆలయాలను దర్శించుకునే అవకాశం ఉందన్నారు. మచిలీపట్నం నగరానికి ప్రత్యేక వన్నె తెచ్చేలా ఉత్సవాలను అత్యద్భుతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**విజయ గణపతి చేతిలో 630 కిలోల బందరు లడ్డు:**

మచిలీపట్నం పేరును దేశవ్యాప్తంగా చాటిచెప్పిన ప్రసిద్ధ బందరు లడ్డుకు మరో అరుదైన గౌరవం దక్కనుందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. 63 అడుగుల విజయ గణపతి చేతిలో ఏకంగా 630 కిలోల భారీ బందరు లడ్డును ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. లడ్డు తయారీకి బందరు ఎంతో ప్రసిద్ధి చెందిందని అందువల్ల బందరులోనే లడ్డును తయారు చేయడం జరుగుతుందని అన్నారు. ఆ బాధ్యత మల్లయ్య స్వీట్స్ అధినేత గౌర వెంకటేశ్వరరావు తీసుకున్నారన్నారు. మచిలీపట్నం బందరు లడ్డుకు ఉన్న చారిత్రక, ప్రత్యేక గుర్తింపును ప్రతిబింబించేలా ఈ భారీ లడ్డును మల్లయ్య స్వీట్స్ అధినేత గౌర వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తయారు చేసి గణపతి చేతిలో ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.63 అడుగుల విజయ గణపతి--630 కిలోల బందరు లడ్డు కలయిక మంగినపూడి సాగరతీర మహాగణపతి ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. భారీ లడ్డును దర్శించుకునేందుకు భక్తులు, నగర ప్రజలు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందన్నారు.ఉత్సవ కమిటీ అధ్యక్షులు చలమలశెట్టి నరసింహారావు మాట్లాడుతూ, బందరు లడ్డు రుచి, నాణ్యత, ప్రత్యేకతకు ఎంతోకాలంగా ప్రసిద్ధి చెందిందన్నారు. ఇప్పుడు 630 కిలోల భారీ లడ్డును గణపతి చేతిలో ఏర్పాటు చేయడం ద్వారా బందరు లడ్డుకు మరింత ప్రత్యేక గుర్తింపు లభించనుందని తెలిపారు. ఉత్సవ కమిటీ చక్కని ఏర్పాట్లు చేస్తోందన్నారు. బందరు వైభవాన్ని పునఃప్రతిష్ఠించేలాగా రాజకీయాలకు, కుల మతాలకు అతీతంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు.విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ మాట్లాడుతూ, సాగరతీర మహాగణపతి ఉత్సవాల్లో 630 కిలోల బందరు లడ్డు భక్తులకు ప్రత్యేక దర్శనంగా నిలవనుందని అన్నారు. భక్తులకు ఆధ్యాత్మిక ఆనందంతో పాటు మచిలీపట్నం ప్రత్యేకతను చాటిచెప్పేలా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.వినాయకుని సన్నిధిలో భక్తి పరిమళాలు వెదజల్లేలా, సాగర అలల సాక్షిగా ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరియనుంది. గణనాథుని దర్శనంతో భక్తుల హృదయాల్లో భక్తి భావం మరింత పెంపొందనుంది. విఘ్నేశ్వరుని కృపతో మచిలీపట్నం ప్రజలకు సుఖశాంతులు, సిరిసంపదలు చేకూరాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. సాగరతీర మహాగణపతి ఉత్సవాలు నగర ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలవనున్నాయి.ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ 63 అడుగుల విజయ గణపతి కి 630 కిలోల బందరు లడ్డు అనే అరుదైన కలయిక మంగినపూడి సాగరతీర గణపతి ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని పేర్కొన్నారు. అనంతరం మల్లయ్య స్వీట్స్ అధినేత గౌర వెంకటేశ్వరరావును శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మద్దుల గిరీష్, బులియన్ జ్యువెలరీ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఉడత్తు కిషోర్, నగర ప్రముఖులు, విద్య, డీఆర్డీఏ, రెవెన్యూ, పోలీస్ శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంగినపూడి బీచ్‌లో మహాగణపతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి.

భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

14 రోజుల పాటు నిరంతర విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, రవాణా సౌకర్యాలు కల్పించాలి.

ప్రతిరోజూ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను ఆకట్టుకోవాలి.

అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజి






మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ :మంగినపూడి బీచ్ సాగర తీరంలో 63 అడుగుల ఎత్తైన మహాగణపతి మట్టి విగ్రహం ఏర్పాటు చేసి 14 రోజుల పాటు నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు.బుధవారం నగరంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్, ఉత్సవాల నిర్వహణకు సంబంధించి శాఖల వారీగా చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించి, పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 63 అడుగుల ఎత్తైన మహాగణపతి దర్శనానికి 14 రోజుల పాటు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రతి శాఖ తమకు అప్పగించిన బాధ్యతలను ముందస్తు ప్రణాళికతో పూర్తి చేయాలని సూచించారు.ఉత్సవాలకు వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఏర్పాటు చేసి, జనసమూహాన్ని సమర్థవంతంగా నియంత్రించాలని పోలీసు శాఖను ఆదేశించారు. పార్కింగ్ ప్రాంతాలను ముందుగానే గుర్తించి, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు.గతంలో బీచ్ ఫెస్టివల్ సందర్భంగా ఎదురైన ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని మచిలీపట్నం--మంగినపూడి ప్రధాన మార్గానికి ప్రత్యామ్నాయంగా గుర్తించిన రహదారిని అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఆ మార్గంలో అవసరమైన జంగిల్ క్లియరెన్స్, రహదారి బలోపేతం తదితర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.మంగినపూడి సాగర తీరంలో భక్తులు సముద్రంలోకి వెళ్లకుండా ప్రత్యేక బారికేడింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచడంతో పాటు లైఫ్ బాయ్స్, లైఫ్ జాకెట్లు, రక్షణ పరికరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.ఉత్సవ ప్రాంగణంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన విద్యుత్ లైన్లు, కండక్టర్లను ముందుగానే మార్చి, ఉత్సవాల సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఉత్సవాలకు భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు, బీచ్ పరిసరాల్లో నిరంతరం పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు.అవసరమైన చోట్ల తగిన సంఖ్యలో డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి, వాటిని ఎప్పటికప్పుడు ఖాళీ చేయాలని సూచించారు. ఉత్సవాల ప్రారంభం నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు పారిశుధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.భక్తుల కోసం తాగునీరు, మొబైల్/తాత్కాలిక మరుగుదొడ్లను తగిన సంఖ్యలో ఏర్పాటు చేసి, వాటి నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఉత్సవ ప్రాంగణంలో అగ్నిప్రమాదాలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని అగ్నిమాపక శాఖను కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచడంతో పాటు కీలక ప్రాంతాల్లో ఫైర్ ఎక్స్టింగ్విషర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. 14 రోజుల పాటు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే నేపథ్యంలో అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు.14 రోజుల పాటు ప్రతిరోజూ సాయంత్రం భక్తులను ఆకట్టుకునేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. స్థానిక కళాబృందాలు, డ్యాన్స్ గ్రూపులు, డ్యాన్స్ స్కూల్స్, నాటక బృందాలు, కళాజాత, కూచిపూడి కళాకారులు తదితరులను భాగస్వామ్యం చేయాలని సూచించారు.మచిలీపట్నం నుంచి మంగినపూడి బీచ్‌కు భక్తుల రాకపోకలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి అరగంటకు బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని, భక్తుల రద్దీని బట్టి సంఖ్యను పెంచాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పి సీఈవో డాక్టర్ జె అరుణ,అదనపు ఎస్పీ వి వి నాయుడు,బందరు ఆర్డిఓ కె సాంబశివరావు, కార్యక్రమ నోడల్ అధికారి డిఆర్డిఏ పీడీ హరిహరినాథ్,డిపిఓ ఎం ధనలక్ష్మి, మచిలీపట్నం నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ దయాకర్, ఆర్ అండ్ బి ఈఈ లోకేశ్వరావు, డ్వామా పీడీ ఎన్ శివప్రసాద్ యాదవ్, మెప్మా పీడీ సాయిబాబు, అగ్నిమాపక, మత్స్య శాఖాధికారులు ఏసురత్నం, అయ్యా నాగరాజా, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సోమశేఖర్, పర్యాటక శాఖ అధికారి జి రామలక్ష్మణరావు, దేవాదాయ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా కొత్త పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణ..

-అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఎన్టీఆర్ భరోసా. ఇదే కూటమి ప్రభుత్వ లక్ష్యం: తాడికొండ చిన్న



ఘంటసాల, శ్రీవార్త న్యూస్ ఘంటసాల మండలం పరిధిలోని శ్రీకాకుళం గ్రామంలో స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు కార్యాలయంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల దరఖాస్తు ప్రక్రియను రాష్ట్ర తెలుగు యువత నాయకులు, శ్రీకాకుళం ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులతో మాట్లాడి పింఛన్లకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.తెలుగుదేశం పార్టీ సూచనల మేరకు దరఖాస్తుల కోసం వచ్చే ప్రజలకు ఎటువంటి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాడికొండ చిన్నా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. షామియానా, మంచినీటి సదుపాయాలను ఏర్పాటు చేసి, దరఖాస్తుదారులకు అవసరమైన సౌకర్యాలను కల్పించారు. తాడికొండ చిన్నా మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్‌కు అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, దరఖాస్తుదారులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి నాగ నాంచారమ్మ, శ్రీకాకుళం టీడీపీ అధ్యక్షులు దాసం రామకృష్ణ, గోపు దుర్గారావు, కృపారావు, కొల్లిపర బుజ్జీ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఈ-క్రాప్‌లో పంటల నమోదు తప్పనిసరిగా పూర్తి చేయాలి




ఘంటసాల, శ్రీవార్త న్యూస్: మండల పరిధిలోని పాపవినాశనం, గోగినేనిపాలెం గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం బుధవారం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు శ్యామల, మండల వ్యవసాయ అధికారి డి. అనూష పాల్గొని రైతులకు పలు సూచనలు, అవగాహన కల్పించారు.రైతులు సాగు చేస్తున్న పంటలను తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. 15 తో ఈ-క్రాప్ నమోదు గడువు ముగియనున్నందున, రైతులు గడువులోగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ఈ-క్రాప్‌లో పంటలను నమోదు చేసుకోకపోతే ధాన్యం కొనుగోలు సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని వివరించారు. రైతులు ఫార్మర్ ఐడీ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ-క్రాప్‌లో పంటలను నమోదు చేసుకున్న రైతులు ఈ-కేవైసీ ప్రక్రియను కూడా తప్పనిసరిగా పూర్తి చేయాలని అధికారులు స్పష్టం చేశారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ దిలీప్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

Pulisher,Owner and Editor kureti satish, printed by Teja cards and stationery ground floor 26-25-2durgi vari veedhi,opp Inox theater Gandhi nagar Vijayawada ,Andra Pradesh 520003.PRGS Nembar: APTEL/26/A4813, Editor: kureti satish,cell number:9866640784,H. No:21-651a,near Suvarna Kalyana mandapam,parasupeta machilipatnam Krishna Distric, Andra Pradesh.521001